

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

సీఎం సహాయనిధికి టీడీపీ సభ్యత్వం అన్నది

## తప్పుడు ప్రచారం

ఖండించిన తెలుగుదేశం పార్టీ

8



## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే

- భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్ ఖరారు
- బీ ఫారాలు అందజేసిన సీఎం చంద్రబాబు
- రేపు నామినేషన్లు వేయనున్న అభ్యర్థులు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు సంబంధించి టీడీపీ అభ్యర్థుల కసరత్తు కొలిక్కి వచ్చింది. పార్టీ తరపున పార్లమెంట్ ఎగువ సభకు పంపే ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తూ అధిష్ఠానం శనివారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. పార్టీ పట్ల అంకితభావం, సామాజిక సమతుల్యతతో పాటు యువ నాయకత్వానికి పెద్దపీట వేస్తూ వారిని ఎంపిక చేసినట్టు పార్టీ స్పష్టం చేసింది. భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్‌లకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బి.ఫారాలు అందజేశారు. వీరు సోమవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.



### ఆగడాలు శృతిమించితే

# వదిలే ప్రసక్తే లేదు

- గొడ్డలి పార్టీకి సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్



- వైసీపీవి ఫేక్ రాజకీయాలు
- డీఎస్సీపై దుష్ప్రచారానికి ఆధారాలతో కౌంటర్ ఇస్తే కంగుతిన్నారు
- నిరంతరం సర్వేలు చేయిస్తున్నా
- తప్పు చేస్తే సొంతవాళ్లనైనా వదిలించుకుంటా
- కూటమితోనే మన ప్రయాణం
- ఇకపై తెలుగుదేశానికి ఓటమి లేదు
- క్లస్టర్ ఇన్చార్జిలతో 'కాఫీ కబుర్లు' భేటీ

2







4

### సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే

# అసలైన నాయకత్వం

- ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకే రష్యా పర్యటన
- మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి
- రష్యా-ఇండియన్ డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్

'సంక్షోభ సమయాల్లోనూ సరికొత్త అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం.. ఏపీ యువతకు గ్లోబల్ ఛాన్సెస్ కల్పించడమే నా పర్యటన ముఖ్య ఉద్దేశం" అని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన 'రష్యా-ఇండియన్ డయాస్పోరా' ప్రతినిధుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ దేశ కీర్తిని పెంచారని కొనియాడిన లోకేష్.. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు కలయికతో కూడిన 'నమో' మంత్రం ఏపీ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని చెప్పారు. ప్రవాసాంధ్రులంతా రాష్ట్రానికి 'బ్రాండ్ అంబాసిడర్లు'గా మారి ఏపీకి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## మొదలైన యోగాంధ్ర-2026

కార్యాచరణకు కూటమి సర్కారు శ్రీకారం

గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు నాలుగంచెల పోటీలు



11

## శిశువును తాకకుండానే కొలతలు!

- ఏఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపునకు 'శిశు మాపన' యాప్
- మంత్రి సత్యకుమార్ యాదవ్



8



9

విశాఖ-అరకు విస్టాడోమ్

## రైలుకు జాతీయ అగ్రస్థానం


'ఇండియా టుడే' నేషనల్ సర్వేలో గుర్తింపు



# ఆగడాలు శృతిమించితే
# వదిలిపెట్టే ప్రసక్తే లేదు

## గొడ్డలి పార్టీకి సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్

- వైసీపీవి ఫేక్ రాజకీయాలు
- డీఎస్సీపై దుష్ప్రచారానికి ఆధారాలతో కౌంటర్ ఇస్తే కంగుతిన్నారు
- నిరంతరం సర్వేలు చేయిస్తున్నా
- తప్పు చేస్తే సొంతవాళ్లనైనా వదిలించుకుంటా
- కూటమితోనే మన ప్రయాణం
- పవన్‌కళ్యాణ్ ఓట్లు చీలనివ్వలేదు కాబట్టే 94% స్ట్రైక్ రేట్‌తో గెలిచాం
- ఇకపై తెలుగుదేశానికి ఓటమి లేదు
- కార్యకర్తలంతా 'ది సీక్రెట్' పుస్తకం చదవాలి
- క్లస్టర్ ఇన్చార్జిలతో 'కాఫీ కబుర్లు' భేటీ



మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపానం నిషేధం చేస్తామని ఇచ్చిన హామీపై గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని విమర్శించారు. వైసీపీ హయాంలో వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో శనివారం సీఎం సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశినిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తింది. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసింది. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోంది. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ అలాగే దుష్ప్రచారం చేసి లబ్ధి పొందాలనుకున్నారు' అని దుయ్యబట్టారు.





### ఆధారాలు సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చాం..

డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సహనం, ఓపిక అవసరం.. అలాగని గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ తిరుగుతుందని ఎద్దేవా చేశారు. టీడీపీకి ఓటమి లేదని, ఇకపై రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు.

### లోకేష్ చక్కగా పని చేస్తున్నారు

ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేష్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పని చేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసిం చారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేష్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు.

### కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం

రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీపరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్‌కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్ర నేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం మార్గనిర్దేశం చేశారు.

క్లస్టర్ ఇన్చార్జిలతో "కాఫీ కబుర్లు" చెప్తూ కార్యకర్తలను సమర్ధవంతమైన నాయకులుగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ 'ది సీక్రెట్' అనే పుస్తకాన్ని తప్పకుండా చదవాలని సూచించారు. బలమైన సంకల్పంతో పనిచేస్తే, అది నెరవేరడానికి కావాల్సిన ఎకో సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఏర్పడుతుందని చెప్పారు.



చైతన్యరథం






# సీఎం ప్రజా దర్బార్

మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి విచ్చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి హామీ ఇచ్చారు.
















## విశాఖను సీఐఎస్/రష్యా మార్కెట్లకు

# ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మారుస్తాం

**ఆర్ఎంఎం ఫార్మా యూనిట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి**

**ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్‌కుమార్‌తో ఏపీ మంత్రి లోకేష్ భేటీ**




మాస్కో (రష్యా): 'విశాఖపట్నాన్ని Commonwealth of Independent States/రష్యా మార్కెట్లకు ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం... ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ డీప్ వాటర్‌పోర్టుల ద్వారా ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహిస్తున్నాం' అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జ×ూ రీజియన్, రష్యా మార్కెట్లలో బలమైన ఎక్స్‌పోర్ట్ నెట్‌వర్క్ ఉన్న ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్ కుమార్‌తో మాస్కోలో భేటీ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నాన్ని వ్యూహాత్మక లాజిస్టిక్స్ గేట్‌వేగా అభివృద్ధి చేయాలని తాము భావిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామ న్నారు.. విశాఖలో నిర్మాణంలో ఉన్న ఆర్ఎంఎం ఫార్మా యూనిట్ ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని కోరారు.

ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ... విశాఖలో రూ.200 కోట్ల వ్యయంతో తమ సంస్థ చేపట్టిన యూనిట్ నిర్మాణం పురోగతిలో ఉందని, దీనిద్వారా 300మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. విశాఖ యూనిట్‌లో ఇంజెక్టబుల్స్, టాబ్లెట్లు, క్యాప్సూల్స్ తయారు చేస్తామని తెలిపారు. 2027 మార్చి నాటికి పూర్తి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమవుతుందని లోకేష్‌కు వివరించారు.

## సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే

# అసలైన నాయకత్వం



- ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకే రష్యా పర్యటన
- భారత్- రష్యా బంధం విడదీయలేనిది
- అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తి ప్రతిష్టలను ప్రధాని మోదీ మరింత పెంచారు
- మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి
- రష్యా-ఇండియన్ డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్

మాస్కో (రష్యా): సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వమని, ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకే తాను రష్యాలో పర్యటిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ప్రవాస భారతీయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... 'రష్యాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు, తెలుగు కుటుంబాలు, విద్యార్థులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మనల్ని ఒకచోట చేర్చిన మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి నా కృతజ్ఞతలు. మీరు భారతదేశాన్ని విడిచి ఇక్కడకు వచ్చారు. కానీ భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మన విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, దేశం పట్ల ప్రేమను నిరంతరం గుండెల్లో మోస్తున్నారు. మీ విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను మరింత బలోపేతం చేస్తున్నాయి. అందుకు ప్రతి భారతీయుడు మిమ్మల్ని చూసి గర్విస్తున్నారు.' అన్నారు.

**భారత్-రష్యా స్నేహ బంధాన్ని శాశ్వతం చేసిన మోదీ**

'ఆధునిక చరిత్రలో అత్యంత విశ్వసనీయమైన శాశ్వత బంధాల్లో భారత్-రష్యా బంధం ఒకటి. ఈ భాగస్వామ్యం కేవలం దౌత్యంపై మాత్రమే కాకుండా దశాబ్దాల పరస్పర గౌరవం, వ్యూహాత్మక విశ్వాసం, ఉమ్మడి ప్రయోజనాలపై నిర్మితమైంది. రక్షణ, అంతరిక్ష సహకారం నుంచి ఇంధనం, సైన్స్, టెక్నాలజీ, విద్యా రంగాల వరకు భారత్, రష్యా అనేక కీలక సందర్భాల్లో కలిసి ప్రయాణించాయి. ప్రపంచం మారింది. ప్రపంచ కూటములు రూపాంతరం చెందాయి. అయినప్పటికీ భారత్-రష్యా స్నేహబంధం పునాది మాత్రం బలంగానే ఉంది. నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో ఈ సంబంధాలు నూతన సహకార రంగాలు, అభివృద్ధి అవకాశాల వైపు విస్తరిస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రక శిఖరాలకు తీసుకెళ్లారు.

**అసలైన నాయకత్వం**

నాయకత్వం అంటే అనుకూల పరిస్థితుల కోసం ఎదురుచూడటం కాదు... సంక్షోభంలో అవకాశాలను సృష్టించడం. నేను ఇక్కడికి పర్యాటకుడిగా రాలేదు. స్పష్టమైన లక్ష్యంతో వచ్చా. భాగస్వామ్యాలను నిర్మించడానికి, సంబంధాలను బలోపేతం చేయడానికే ఇక్కడకు వచ్చా. అన్నింటికంటే ముఖ్యంగా.. ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకు వచ్చాను.

**పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం**

నేడు ఏపీ దేశంలోనే సరికొత్త అభివృద్ధి లక్ష్యాలతో దూసుకుపోతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. యువ జనాభా, వ్యూహాత్మక భౌగోళిక స్థానం, సుదీర్ఘ తీర ప్రాంతం, ఆధునిక ఓడరేవులు, అపార సహజవనరులు కలిగి ఉండటం మనకు వరం. కానీ మన గొప్ప బలం మన ప్రజలే. ప్రతిఏటా లక్షలాది మంది యువత మెరుగైన జీవితం నిర్మించుకునేందుకు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వపరంగా పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను, స్థాపించడం, ఉపాధిని సృష్టించడం, జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రతి యువకుడు విజయవంతం కావడానికి తగిన అవకాశం ఉండేలా కృషి చేస్తున్నాం.

**ప్రతి కుటుంబానికీ అభివృద్ధి ఫలాలు చేరాలి**

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ శక్తిని చంద్రబాబు ముందే గ్రహించారు. ఇన్నోవేషన్ అనేది ట్రెండ్ కాకముందే టెక్నాలజీ ఎకో సిస్టమ్ నిర్మించేందుకు కృషి చేశారు. పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉత్పాదకత, సాంకేతికత, స్థిరమైన వృద్ధికి ఏపీని గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడంపై ఈ రోజు మళ్లీ దృష్టిసారించారు. సంపదను సృష్టించడం, ఉపాధి కల్పించడం, అవకాశాలు సృష్టించడం, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ అందేలా చూడటమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారు.

**పెట్టుబడులను ఉపాధిగా మార్చడమే లక్ష్యం**

గత రెండేళ్లలో ఏపీ దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానాల్లో ఒకటిగా నిలిచింది. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్స్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. స్థిరత్వం, మౌలిక వసతులు, అనుసంధానం, నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రగతిశీల విధానాలు, అమలుకు కట్టుబడిన రాష్ట్రంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌వైపు చూస్తున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు వాటిని ఉపాధిగా మార్చడమే మా లక్ష్యం.

**మాతృభూమి అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి**

ఏపీతో భాగస్వాములు కావాలని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని రష్యాలోని భారతీయ సమాజానికి, రష్యన్ భాగస్వాములకు వ్యక్తిగతంగా ఆహ్వానం పలుకుతున్నాను. మీ మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావడానికి ఇదే సరైన సమయం. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టే పెట్టుబడి కేవలం ఆర్థికపరమైన నిర్ణయం మాత్రమే కాదు. ఇది మానవ సామర్థ్యంపై పెట్టే పెట్టుబడి. ఇది లక్షలాది మంది యువ భారతీయుల భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి. ఇది రాబోయే తరంపై పెట్టే పెట్టుబడి.

ఏపీలో నమో అంటే నాయుడు, మోదీ కలయిక

నరేంద్ర మోదీ భారతదేశానికి ఆత్మవిశ్వాసం, అంతర్జాతీయ గౌరవం, ఆర్థిక వేగం, వ్యూహాత్మక బలాన్ని అందించారు. సీఎం చంద్రబాబు ఆ వేగాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, ఉద్యోగాల సృష్టిగా మారుస్తున్నారు. ఇద్దరూ కలిసి అభివృద్ధి, వృద్ధి, అవకాశాలకు ప్రతీకగా నిలుస్తున్నారు. బలమైన భారతదేశం కోసం 'నమో' (నరేంద్ర మోదీ). బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం 'నమో' (డబుల్ నమో) నాయుడు-మోదీ కలయిక. ప్రతి యువకుడికీ అవకాశం, ప్రతి కుటుంబానికీ శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నారు.

**ప్రవాసాంధ్రులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి**

కష్టాన్ని నమ్ముకున్న తెలుగువారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గౌరవం దక్కుతుంది. ఏ దేశంలో ఉన్నా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోరు. మీ మనస్సు రాష్ట్రం మీదే ఉంటుంది. మీకు ఏ సమస్య ఉన్నా ఏపీఎన్ఆర్టీ అండగా ఉంటుంది. మీ బాధ్యత నాది. తెలుగు కుటుంబాలను చూసినప్పుడు నాకు గర్వంగా ఉంటుంది. మీరంతా ఎంతో సాధించారు. ఇప్పుడు సొంత రాష్ట్ర అభివృద్ధిలో భాగంకండి.. మీరంతా బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ఏపీని ప్రమోట్ చేయండి. ఒక్క పెట్టుబడి... ఒక్క పరిశ్రమ తీసుకురండి... యువతకు ఉద్యోగాలు కల్పించడంలో మీరు భాగస్వాములవ్వండి.

**భవిష్యత్ తరాల కోసం అవకాశాలను సృష్టిద్దాం**

భారతదేశం, ఆంధ్రప్రదేశ్, ప్రపంచవ్యాప్త భారతీయ సమాజం ఎదుగుతోంది. భారత్, రష్యా మధ్య ఉన్న చారిత్రాత్మక స్నేహాన్ని మనం మరింత బలోపేతం చేద్దాం. వృద్ధి, ఆవిష్కరణల కోసం కొత్త భాగస్వామ్యాలను నిర్మిద్దాం. భవిష్యత్ తరాల కోసం అవకాశాలను సృష్టిద్దాం. సంపన్నమైన ఆంధ్రప్రదేశ్, బలమైన భారతదేశం, ప్రపంచానికి మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి అందరం కలిసి పనిచేద్దామని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో ఇండియన్ అంబాసిడర్ ఇన్ మాస్కో వినయ్‌కుమార్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు పాల్గొన్నారు.











# తోటి విద్యార్థులే ఉపాధ్యాయులు..

# ప్రాజెక్టు ఆధారిత పాఠాలు






- **మాస్కోలో టీచర్లు లేని వినూత్నమైన భవిష్యత్ పాఠశాల**
- **స్కూలు 21ని సందర్శించిన ఏపీ విద్యా మంత్రి నారా లోకేష్**

మాస్కో (రష్యా): మాస్కోలో స్బేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న విభిన్నమైన పాఠశాల స్కూల్ 21ను ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. సంప్రదాయ విద్యా విధానానికి భిన్నంగా అక్కడ అనుసరిస్తున్న విధానాలను నిర్వాహకులు, విద్యార్థుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్కూల్ 21 అనేది రష్యాలో స్బేర్ బ్యాంక్ ప్రారంభించిన ఉచిత ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విద్యా కార్యక్రమం. ఇక్కడ విద్యార్థుల నుంచి ఎటువంటి ట్యూషన్ ఫీజు వసూలు చేయరు. ఇది ఇంటర్నేషనల్ 42 నెట్‌వర్క్‌లో సభ్యత్వం కలిగి స్వతంత్రంగా పని చేస్తుంది. ఫ్రెంచ్ కోడింగ్ స్కూల్ అయిన ఎకోల్ 42 రూపొందించిన వినూత్నమైన "భవిష్యత్ పాఠశాల" విద్యా పద్ధతులను అనుసరిస్తుంది.

### స్కూల్ 21 ప్రధాన ప్రత్యేకతలివే...

1. సంప్రదాయ విద్యా విధానం లేదు: ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక ఉపన్యాసాలు, సంప్రదాయ గ్రేడ్‌లు ఉండవు.
2. సహచర విద్యార్థుల ద్వారా అభ్యసనం: విద్యార్థులు పూర్తిగా గేమిఫైడ్, ప్రాజెక్ట్-ఆధారిత సహకార పనుల ద్వారా నేర్చుకుంటారు. ఒకరి కోడ్‌ను మరొకరు మూల్యాంకనం చేసుకుంటారు.
3. ట్యూషన్-రహిత విధానం: ఈ ప్రోగ్రామ్‌కు నిధులను స్బేర్ బ్యాంక్ పూర్తిగా సమకూరుస్తుంది. ఎంపికైన అభ్యర్థులు ఎటువంటి ఖర్చు లేకుండా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదవడానికి అవకాశం కలుగుతుంది.
4. 24/7 సౌకర్యవంతమైన ప్రవేశం: క్యాంపస్‌లు నిరంతరం పని చేస్తాయి. దీనివల్ల విద్యార్థులు తమ సొంత అధ్యయన వేగాన్ని, షెడ్యూళ్లన నిర్వహించుకోవచ్చు.

### విభిన్నమైన ఎంపిక ప్రక్రియ

స్కూల్ 21లో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. గత విద్యా ప్రతిభ, డిగ్రీలు లేదా ముందస్తు కోడింగ్ పరిజ్ఞానాన్ని ఇక్కడ పరిగణలోకి తీసుకోరు. సాధారణ నమోదుకు ముందు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ కాగ్నిటివ్ పరీక్ష పూర్తి చేయాలి. దాని తర్వాత సమస్య పరిష్కార నైపుణ్యాలను, అనుకూలతలను అంచనా వేయడానికి "పిసిన్" (స్విమ్మింగ్ పూల్) అని పిలువబడే అనేక వారాల పాటు జరిగే ఒక ఇంటెన్సివ్ ఆన్-సైట్ ఎంపిక శిబిరంలో పాల్గొనాలి. అక్కడ వారు ఇచ్చిన టాస్క్‌లపై ప్రత్యక్షంగా ప్రదర్శించిన తెలివితేటలను బట్టి ఎంపిక ప్రక్రియ ఉంటుంది.








# అమరావతి, విశాఖ నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్



### లాస్ట్-మైల్ రవాణా ఖర్చుల తగ్గింపుపై అధ్యయనం చేయండి

### యాండెక్స్ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ చర్చలు





మాస్కో (రష్యా): రష్యన్ పారిశ్రామికవేత్తలు, మేనేజర్లు, ఫండ్ నిర్వాహకుల కన్సార్టియంతో ఏర్పాటైన యాండెక్స్ (Yandex) సంస్థ ఉన్నత స్థాయి బృందంతో ఏపీ మంత్రి నారా లోకేష్ మాస్కోలో భేటీ అయ్యారు. యాండెక్స్ టెక్ డిప్యూటీ సీఈవో అలెగ్జాండ్రా షిపినా-సాంచెజ్, యాండెక్స్ ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ సీఈవో డెనిస్ కాసిమోవ్, యాండెక్స్ క్లౌడ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మారట్ నూరియేవ్, యాండెక్స్ మేనేజర్ ఫర్ గ్లోబల్ గవర్నమెంట్ ఎఫైర్స్ & పబ్లిక్ పాలసీ నికితా పోపోవ్ లతో స్బేర్ సిటీలో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి రాజధాని నగరం, విశాఖపట్నం AI డేటా సెంటర్ అంతటా యాండెక్స్ స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్‌ను అమలు చేయడంపై మంత్రి లోకేష్ చర్చించారు. లాస్ట్-మైల్ రవాణా ఖర్చులను తగ్గించడానికి, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న హైపర్-లోకల్ క్విక్-కామర్స్, డెలివరీ ఫ్లీట్‌లలోకి యాండెక్స్ అధునాతన అటానమస్ వెహికల్ స్టాక్, ప్రిడిక్టివ్ రూటింగ్ సాఫ్ట్‌వేర్‌ను ఇంటిగ్రేట్ చేయడానికి గల అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు. భారతదేశంలో స్థానిక ప్రజా పరిపాలన సాధనాలకు యాండెక్స్ ఫౌండేషన్ AI మోడల్స్ & హై-పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌లకు లైసెన్స్ మంజూరు అంశంపై సమావేశంలో చర్చించారు.



# స్బేర్ సిటీని సందర్శించిన


# ▶ మంత్రి నారా లోకేష్

మాస్కో (రష్యా): మాస్కోలోని స్బేర్ సిటీని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. స్బేర్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ ఉ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఆల్బర్ట్ ఎఫిమోవ్ (Mr.Albert Efimov) స్బేర్ సిటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎవ్జెనియ్ చులానోవ్ (Mr.Evgeniy Chulanov), డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇలియా పుల్నర్ (Mr.Ilya Pulner) మంత్రి లోకేష్ బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్ధారణ, ఇతర ఆవిష్కరణలతో కూడిన స్బేర్ బ్యాంక్ ఏటీఎంను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత స్బేర్ సిటీ ప్రతినిధులు అక్కడి ఆర్ & డీ, క్వాంటం టెక్నాలజీ సెంటర్, ఏఐ ఆధారిత సేవలు, డిజిటల్ హెల్త్ కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్, డిజిటల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అత్యంత విశ్వసనీయమైన ఎంటర్‌ప్రైజ్ హార్డ్‌వేర్ అప్టైమ్‌ను నిర్ధారించడం, అంతర్గత సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్‌లను అమలు చేయడం, స్థానికీకరించిన కార్పొరేట్ టెక్ ఆధునికీ కరణను ముందుకు నడపడంపై తాము దృష్టిసారించినట్లు వారు తెలిపారు. ఆటోమేటెడ్ మౌలిక సదుపాయాలు, స్మార్ట్ పరికరాల నెట్‌వర్క్‌లు, విస్తృతమైన ఎలక్ట్రిక్ వాహనాల (EV) ఛార్జింగ్ గ్రిడ్‌ల అధిక-లోడ్ డిమాండ్లను నిర్వహించగల వినూత్న విద్యుత్ వ్యవస్థలను అమలు చేయడం తమ లక్ష్యమని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కృతమైన స్బేర్ సిటీ భవిష్యత్ టెక్నాలజీకి వారధిగా నిలుస్తుందని మంత్రి లోకేష్ కొనియాడారు.








రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరుపున లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు శనివారం అమరావతి అసెంబ్లీ భవనంలో లింగమనేని రమేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్ వనితారాణికి అందచేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం అఖిల్ కుమార్, పి విజయకుమారి, అదేవిధంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, పులవర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఎన్ ఈశ్వరరావుతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యత

## మార్కాపురం జిల్లాలో నేరాల్లో 17శాతం తగ్గుదల: హోం మంత్రి వంగలపూడి అనిత

మార్కాపురం (చైతన్య రథం): మహిళలు, బాలికల భద్రత, రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో 17 శాతం తగ్గుదల సాధించడంతోపాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టిన మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ పనితీరును మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో మంత్రి వంగలపూడి అనిత కనిగిరిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, పోలీసు పరిపాలనా విభజన, సర్కిళ్లు, మండలాల పరిధి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను పెంచే



విధంగా అధికారులు తమ విధులను నిర్వహించాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సానుకూలంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని తెలిపారు. ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర నియంత్రణలో మరింత విస్తృతంగా వినియోగించాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు చేపట్టి, మంచి పోలీసింగ్ ద్వారా నేరస్థుల్లో భయాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని, సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, మహిళలు, బాలికలకు సంబంధించిన నేరాల నియంత్రణ, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాలపై జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలపై జరిగే నేరాల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి న్యాయస్థానాల్లో అభియోగపత్రాలు దాఖలు చేస్తున్నామని, పోక్సో కేసుల్లో శిక్షల శాతం పెరిగిందని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లు అమలు చేసి, ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను కూడా అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు. నాగరాజు, కనిగిరి ఇన్‌చార్జి డీఎస్పీ పి. శ్రీధర్, సీఐలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసి ఓటు అడుగుతాం

- **గొడ్డలి పార్టీకి ఓటు అడిగే హక్కే లేదు**
- **దేనిపైనైనా చర్చకు సవాల్**
- **మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

బనగానపల్లె (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ అభివృద్ధి చేసి ఓటు అడుగుతుందని, గొడ్డలి పార్టీకి ఓటు అడిగే అర్హతే లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. అవుకు మండలం జూనుతల, కొండమనాయునిపల్లి గ్రామాల పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు బహిరంగ చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఏం చేసిందో, మాజీ ఎమ్మెల్యే ఏం చేశాడో ఎక్కడైనా చర్చకు రావాలని నేరుగా సవాల్ చేశారు.

**హామీ మేరకు అభివృద్ధి పనులు:**

కొండమనాయునిపల్లి గ్రామానికి ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశానని మంత్రి వెల్లడించారు. ఈ గ్రామానికి దాదాపు రూ.32 లక్షలతో రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. జూనుతల గ్రామానికి 2014-19 మధ్య ఎమ్మెల్యేగా రూ.64 లక్షల నిధులు వెచ్చించామని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం రూ.10 లక్షలు మాత్రమే వెచ్చించిందని, ప్రస్తుతం రెండేళ్లలో దాదాపు రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. స్థానికంగా దాదాపు రూ.9 కోట్లతో అవుకు నుంచి మూడు ఆర్‌డబి రహదారులను స్థానిక గ్రామాలతో అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బనగానపల్లి నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద అవుకు రిజర్వాయర్ నుంచి రూ.510 కోట్ల నిధులతో ఇంటింటికి కులాయి కనెక్షన్ త్వరలో అందించబోతున్నామని వెల్లడించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

**వైసీపీపై ఘాటు విమర్శలు:**

పింఛన్ 2,000 నుంచి 3,000కు పెంచుతామని చెప్పి వైసీపీ ప్రజలను మోసం చేసిందని మంత్రి ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట మేరకు కూటమి ప్రభుత్వం పింఛన్ 3,000 నుంచి 4,000కు పెంచిందని, ప్రజలను వంచించలేదని స్పష్టం చేశారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇద్దరు బిడ్డలకు మాత్రమే తల్లికి వందనం ఇస్తామని ప్రతిపక్ష నేత సతీమణి వైఎస్ భారతి చెప్పారని గుర్తు చేశారు. తల్లికి వందనం మాత్రమే కాదు, ఏ పథకంపైనైనా, ఏ గ్రామంలో అయినా చర్చకు సిద్ధమని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. స్త్రీ శక్తి పథకంతో ఆడపడుచుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని అన్నారు.

ప్రజలు 151 సీట్లు ఇస్తే గొడ్డలి పార్టీ అరాచకం చేసి పంగనామాలు పెట్టిందని, 11 సీట్లకు పరిమితం



చేసి ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని మంత్రి అన్నారు. చాక్లెట్ ఇవ్వండి అన్న తరహాలో ప్రతిపక్ష హోదా ఇవ్వండి అని ప్రతిపక్ష నేత దేభరిస్తున్నారని విమర్శించారు. పాస్ పుస్తకాలపై గొడ్డలి పార్టీ నాయకుడు ఎవడబ్బ సొమ్మని తన బొమ్మ వేయించుకున్నాడని, ఫోటోల పిచ్చితో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. నకిలీ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి మద్యం కుంభకోణం చేశారని, సంపూర్ణ మద్యపాన నిషేధం చేసి ఎన్నికలకు వెళ్తామని సవాల్ చేసి సిగ్గు లేకుండా ఎన్నికలకు వెళ్లారని తీవ్రంగా విమర్శించారు. అమరావతి రాజధాని ప్రజలను మోసం చేసి మూడు ముక్కలాటాడారని నిలదీశారు. రీ సర్వేను తప్పులు తడకగా మార్చేశారని, గత ఐదేళ్లలో పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేశారని, రాష్ట్రాన్ని గుంతలమయం చేశారని మంత్రి ఆరోపించారు.

**పరిశ్రమలు, అభివృద్ధిపై కూటమి సాధనలు:**

డీఎస్సీతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే అర్థం లేని ఆరోపణలు ప్రతిపక్షం చేస్తుందని మంత్రి అన్నారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంగా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో పారిపోయిన పరిశ్రమలు నేడు పరిగెత్తుకొస్తుంటే ప్రతిపక్ష నేత బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పరిశ్రమలు వస్తే నిరుద్యోగం తగ్గుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజకీయ ఉనికి కోసమే ప్రతిపక్షం విమర్శలకు పాల్పడుతుందని మంత్రి జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నామని, త్వరలో పోలవరం పూర్తి కాబోతుందని, అమరావతి పనులు శరవేగంగా సాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3 వేల కోట్లతో రాష్ట్రంలో ఆర్‌డబి రహదారులను అభివృద్ధి చేస్తున్నామని, 27 వేల కిలోమీటర్ల రహదారులను రెన్యువల్ చేశామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి చేసే పార్టీకి అధికారం కట్టపెట్టాలని ఆయన ప్రజలను కోరారు.

చైతన్యరథం

# పుష్కరాలకు జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలు

- **మునికూడలి ఘాట్‌కు 'సప్తర్షి పుష్కర్ ఘాట్' నామకరణం**
- **గోదావరి పుష్కరాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



అమరావతి (చైతన్య రథం): గోదావరి పుష్కరాలను స్వచ్ఛంగా, శుభ్రంగా నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ తపన అని, ఇందుకు అనుగుణంగా గోదావరి పుష్కరాలకు ఆతిథ్యం ఇచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీరు చుక్క కూడా గోదావరిలోకి కలవకుండా చర్యలు తీసుకోవాలని, జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా తీర్చిదిద్దే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై శనివారం జిల్లా కలెక్టర్లతో, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, పుష్కర ఘాట్లు, పుష్కర నగర్‌ల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాల విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరమని తెలిపారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ అనేది లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. పార్కింగ్, వీధి దీపాలు, వస్త్రాలను మార్చుకునే గదులు, జల్లు స్నానాలు, రోడ్లు, డ్రైన్లు, ఆలయాలు, ఇతర ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

పంచాయతీల మురుగు నీటి వ్యవస్థను సరిదిద్దాలని, మ్యాజిక్ డ్రైన్ల ద్వారా మురుగు నీటిని సమూలంగా అరికట్టేలా పంచాయతీలవారీగా ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. మ్యాజిక్ డ్రైన్ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

సీతానగరం వద్ద ఉన్న మునికూడలి ఘాట్‌ను జాతీయ స్థాయి మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దాలని, 'సప్తర్షి పుష్కర్ ఘాట్' పేరిట అభివృద్ధి చేయాలని తెలిపారు. 80 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఘాట్‌లో 75 వేల మంది పుష్కర స్నానం చేసేందుకు అనువుగా ఉంటుందన్నారు. వద్ద ఉన్న సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేబినెట్ సమావేశం తర్వాత మునికూడలి ఘాట్‌ను స్వయంగా సందర్శిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఓఎస్డీ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ యూనిట్లు

- **పీఎం సూర్యఘర్ పథకంతో విద్యుత్ ఛార్జీల ఆదా**
- **స్పష్టం చేసిన మంత్రి గొట్టిపాటి**



అద్దంకి (చైతన్య రథం): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని జే.పంగలూరు మండలంలో శనివారం నాడు మంత్రి గొట్టిపాటి పర్యటించారు. అరికట్లవారిపాలెం గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన 28 రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ, సోలార్ యూనిట్ల వినియోగంతో విద్యుత్ ఛార్జీలు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రెండు కిలోవాట్ల రూఫ్ టాప్ యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందిస్తుందని పేర్కొన్నారు. రెండు కిలోవాట్ల యూనిట్‌తో నెలకు సుమారు 240 యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని సంబంధిత కాంట్రాక్టర్ మంత్రికి వివరించారు. బీసీ, ఓసీ వినియోగదారులకు కూడా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, మూడు కిలోవాట్ల యూనిట్‌కు బీసీ వర్గాలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని మంత్రి వివరించారు. రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి కాంట్రాక్టర్లు నాణ్యత నిబంధనలు, ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు.

సూర్యఘర్ ప్రారంభం అనంతరం జే.పంగలూరు మండలంలోని చందలూరు గ్రామానికి మంత్రి గొట్టిపాటి చేరుకున్నారు. చందలూరు నుంచి గంగవరం వరకు రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి ప్రజలకు అంకితం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధిని కూడా ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

***బనగానపల్లెలో అర్జీలు స్వీకరించిన మంత్రి జనార్ధన్ రెడ్డి***



బనగానపల్లె (చైతన్య రథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు ఒ భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తమైంది. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

## సీఎం సహాయనిధికి టీడీపీ సభ్యత్వం


# తప్పనిసరి అన్నది తప్పుడు ప్రచారం

***- ఫేక్ ప్రచారాన్ని ఖండించిన తెలుగుదేశం పార్టీ***

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండాలని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసినట్టు జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. అటువంటి ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఫొటో వాడుతూ కొందరు చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. తెలుగుదేశం పార్టీ విలువలతో కూడిన రాజకీయానికి కట్టుబడి పని చేస్తుందని, ఇలాంటి డొంకతిరుగుడు రాజకీయాలు చేయదని పార్టీ స్పష్టం చేసింది. కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకోవడానికి, వారికి మేలు చేయడానికి పని చేస్తున్నదని, ప్రభుత్వ నిధులతో రాజకీయం చేయడానికి కాదని పార్టీ తెలిపింది. సీఎం సహాయనిధి కోసం చేసే దరఖాస్తులకు పార్టీ సభ్యత్వం ఉండాల్సిన అవసరం లేదని, అర్హతను బట్టి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందుతుందని ఈ తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని పార్టీ కోరింది.

## శిశువును తాకకుండానే కొలతలు!

- **ఏఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపుకు**
- **'శిశు మాపన' యాప్: మంత్రి సత్యకుమార్ యాదవ్**



అమరావతి (చైతన్య రథం): నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపునకు ఏఐ (కృత్రిమ మేధస్సు) ఆధారిత సేవలు వినియోగించబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దైనందిన విధుల్లో భాగంగా ఆశాలు ఉపయోగించే యాప్‌లోనే ఏఐ ఆధారిత నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల వివరాలను అనుసంధానం చేస్తామని తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖతో కుదిరిన అవగాహన ప్రకారం 'వాద్వానీ–ఏఐ' సంస్థ రూపొందించిన 'శిశు మాపన్ యాప్' ఆధారంగా అనుసంధానం జరుగుతుందని పేర్కొన్నారు.

**వెయింగ్ మిషన్ లేకుండానే..**

ప్రస్తుతం ఆశాలు పుట్టినప్పటి నుంచి 42 రోజుల్లోగా ఆరుసార్లు నవజాత శిశువుల ఇళ్లకు వెళ్లి, తల చుట్టు, ఛాతీ, చేతి చుట్టు, బరువు, ఎత్తుల వివరాలను గుర్తించాలి. వెయింగ్ మిషన్, ఇన్ఫాంటో మీటర్, టేపులను మోస్తూ నవజాత శిశువులు ఉన్న ఇళ్లకు వెళ్లడంలో ఆశాలు అవస్థలు పడుతున్నారు. ఒక్కో ఇంటి వద్ద కనీసం 10–15 నిమిషాలు సమయం పడుతోంది. అంతేకాకుండా కొలతలు గుర్తింపు, వివరాల నమోదుకు శిశువులు సహకరించకపోవడం, అసౌకర్యానికి గురవడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో వాద్వానీ సంస్థ శిశువును తాకకుండానే బరువు, ఎత్తు, ఛాతీ, భుజం కింద, తల చుట్టుకొలత గుర్తించేందుకు 'శిశు మాపన' యాప్‌ను తయారుచేసింది. దీనివల్ల శిశువు దగ్గర యాప్ డౌన్లోడ్ చేసిన చరవాణిని ఉంచినట్లయితే అత్యంత తక్కువ వ్యవధిలో నిర్దేశిత ప్రమాణాలు అందులో ఆటోమేటిగ్గా నమోదవుతాయి.

**1,000 శిశువుల డేటా బేస్:**

ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా శిశువుల శరీరతత్త్వం ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సుమారు వెయ్యి మంది శిశువుల ఆరోగ్య ప్రమాణాల డేటా బేస్ (వీడియోలు)ను ఏఐకి వైద్య ఆరోగ్య శాఖ అందించబోతుంది. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని ఇందిరానగర్, కొప్పురావు కాలనీ, కాజా, ఎర్రబాలెం పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు వెయ్యి మంది నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను 'శిశు మాపన' యాప్ ఆధారంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డేటా బేస్ తయారైతే వివరాలను ఆశాల యాప్‌లో ఇంటిగ్రేట్ చేస్తారు. ఇదంతా జరిగేందుకు కనీసం మూడు నెలల వరకు సమయం పడుతుంది.

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఆశాలు, ఎ.ఎన్.ఎం.లకు దశలవారీగా శిక్షణ ఇచ్చి ఫీల్డ్‌లో వీడియోలు తీసే ప్రక్రియ శుక్రవారం నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. 'శిశు మాపన' యాప్ ద్వారా తక్కువ సమయంలోనే నవజాత శిశువుల ఎదుగుదలలో లోపాలు ఉన్నట్లయితే తెలిసిపోతుందని, దీనికి అనుగుణంగా సదరు ప్రాంతాల మెడికల్ ఆఫీసర్లకు అలర్ట్ వెళ్తుందని వివరించారు. ఫలితాలు అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా ఏఐ ఆధారిత సేవల ద్వారా నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపు మొదలవుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. దీనివల్ల ఆశాలు, ఎ.ఎన్.ఎం.లపై పనిభారం తగ్గుతుందని తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ మాట్లాడుతూ, చరవాణుల ద్వారా తీసే వీడియోల ద్వారా గుర్తించే వివరాల నమోదులో ఖచ్చితత్వంలో ఎటువంటి సమస్యలు లేవని పేర్కొన్నారు.

## వెన్నుపోటు దినానికి
# కేరాఫ్ అడ్రస్.. జగన్

**కన్న తల్లి, సొంత చెల్లినుంచే వెన్నుపోటు మొదలు - జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి వాసంశెట్టి**

అమరావతి (చైతన్య రథం): సొంత ఇంటినుంచే వెన్నుపోటు ప్రారంభించిన జగన్ వెన్నుపోటు దినానికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ధ్వజమెత్తారు. కన్న తల్లి, సొంత చెల్లి నుంచే జగన్ వెన్నుపోటు మొదలైందని ఆయన వ్యాఖ్యానించారు. బాబాయ్‌కి వెన్నుపోటుతోపాటు గొడ్డలిపోటు వేయించి గంగ్ర గొడ్డలి పార్టీగా పేరు తెచ్చారని విమర్శించారు. పేర్ని నాని, కొడాలి నానిల పిచ్చి పిచ్చి ప్రెస్మీట్‌లు మరో పిచ్చోడైన జగన్‌కు మాత్రమే నచ్చుతాయని మంత్రి సుభాష్ వ్యాఖ్యానించారు. జగన్ మానసిక స్థితికి మందుల డోస్ పెంచితే ఏం ప్రమాదం ఉంటుందో అనే భయం వైద్యుల్లో ఉందని, నరంలేని నాలుక ఎటైనా తిరిగే జగన్‌కు అప్పుడప్పుడు కరెంట్ షాక్‌లాంటి చికిత్స అవసరమని ఘాటుగా వ్యాఖ్యానించారు. జగన్ ప్రెస్మీట్ అంటే కాసేపు నవ్వుకోవడానికి స్ట్రెస్ రిలీఫ్‌గా ఫీలవుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పేకాట క్లబ్బులు, క్యాసినోలు ఆడించే బ్యాచ్‌కు బ్రిడ్జ్ కోర్సు గురించి ఎలా తెలుస్తుందని నిలదీశారు. అపహాస్యం పాలయ్యే వింత కార్యక్రమాలు వైసీపీ చేపడుతోందని ఆయన విమర్శించారు. కోటి సంతకాలు అన్న వాళ్ళకి ప్రజా మద్దతు లేకపోవడంతో పెట్టిన సంతకాలు మళ్లీ మళ్లీ పెట్టేందుకు వైసీపీ నేతలు ఇబ్బంది పడ్డారని మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు.



## ఎన్నికల హామీమేరకు
# పేదలకు 3 సెంట్ల స్థలం

- యువతకు ఉద్యోగాలిస్తుంటే వైసీపీ ఓర్వలేకుంది
- డీఎస్సీపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారాలు
- మాది పారదర్శక విధానం.. వైసీపీది మోసపూరితం
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- చెన్నిపాడులో ఇళ్ల పట్టాల పంపిణీ



ప్రకాశం /పొన్నలూరు (చైతన్య రథం): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెన్నిపాడులో మంత్రి డా.స్వామి మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య 20 మంది మహిళలకు ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... "ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం పేదలకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తున్నాం. మేం పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేశారు. వైసీపీ కుట్రలు చేదించి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నాం. ఇది పేద ప్రజల విజయం. జగన్ పెత్తందారి స్వభావం ఇంకా మార్చుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. చెప్పిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పిస్తుంటే వైసీపీ ఓర్వలేక విషం చిమ్ముతోంది. 300 దివ్యాంగ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నాం. మెగా డీఎస్సీతో అత్యంత పారదర్శకంగా 13 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. డిఎస్సీపై వైసీపీ నాయకులు 200పైగా కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏడాది తర్వాత నిద్రలేచి గొడ్డలి పార్టీ నాయకులు డిఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో జగన్ కనీసం ఒక టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. వైసీపీ హయాంలోనే గ్రూప్ 1 ఉద్యోగాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ ఏది చేసినా మోసమే. కొండపి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ హయాంలోనే. రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం, సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు" అని మంత్రి పేర్కొన్నారు. వైసీపీ ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హితవు పలికారు.

### విశాఖ-అరకు విస్టాడోమ్
## రైలుకు జాతీయ అగ్రస్థానం

**'ఇండియా టుడే' నేషనల్ సర్వేలో నెంబర్1 గుర్తింపు**



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో జాతీయస్థాయి అరుదైన గౌరవం దక్కింది. 'ఇండియా టుడే' నేషనల్ సర్వేలో దేశంలోనే నెంబర్-1 రూట్‌గా విశాఖ-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం నిలిచింది. "ఇండియన్ రూట్స్" ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో ఈ విస్టాడోమ్ రైలుకు అగ్రస్థానం లభించింది. జూన్ 15న గోవాలో ప్రతిష్టాత్మక 'ఇండియా టుడే టూరిజం సమ్మిట్ అండ్ అవార్డ్స్ -2026' ప్రధానోత్సవం జరగనున్నది. ఏపీ తరపున అవార్డు అందుకోవాల్సిందిగా పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌కు 'ఇండియా టుడే' అధికారిక ఆహ్వానం అందించింది. ఈ జాతీయస్థాయి అవార్డు రావడంపై పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. గోవా వేదికగా జూన్ 15న ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ అవార్డుతో ఏపీ పర్యాటక రంగానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అంతేకాక, దేశంలో టూరిజం రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై కీలక సెషన్లలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. తూర్పు కనుమల అందాలు, గుహలు, పచ్చని లోయల గుండా సాగే విశాఖ-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణానికి జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ అవార్డు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పర్యాటకుల తాకిడిని మరియు పర్యాటక రంగాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులపై అలక్ష్యం వద్దు

**పనుల పురోగతిపై మంత్రి మండిపల్లి సమీక్ష**



రాయచోటి (చైతన్య రథం): నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులు అలసత్వం చూపొద్దని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. పలు అంశాలపై ఆర్డీవో, ఎంపిడిఓ, ఎమ్మార్వోలకు ఆదేశాలిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో రాయచోటి అభివృద్ధి, సంక్షేమ పనులపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. రాయచోటి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

**- రేపటి నుంచి టెన్త్ ప్రారంభం**

**- చీఫ్, అసిస్టెంట్ ఎగ్జామినర్ల నియామకం**

కర్నూలు(చైతన్యరథం): కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఆదివారం నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్సడు సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని ఆర్ఐవో జి.లాలెప్ప తెలిపారు. ఆదివారం తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం, చరిత్ర, గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, మైనర్ లాంగ్వేజెస్ మైనర్ మీడియా సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభ మవుతుందని చెప్పారు. సంబంధిత అసిస్టెంట్ ఎగ్జామినర్స్, చీఫ్ ఎగ్జామినర్స్ ఉదయం 9.30 గంటలకు విధిగా హాజరు కావాల న్నారు. సోమవారం కామర్స్, సివిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని చెప్పారు. వాల్యుయేషన్ విధులకు ఉత్తర్వు లు వచ్చిన అధ్యాపకులను తక్షణమే రిలీవ్ చేసి వారిని నిర్దేశిత తేదీల్లో శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. జిల్లాకు మొత్తం 1,02,100 జవాబు పత్రాలు వచ్చాయని చెప్పారు. వాల్యుయేషన్ ఏసీవోలు 32 మంది, చీఫ్ ఎగ్జామినర్లు 153 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 1446 మంది, స్క్రూటినైజర్స్ 180 మందిని నియమించినట్లు ఆర్ఐవో తెలిపారు.

**రేపటి నుంచి పదో తరగతి పత్రాలు**

కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్నట్లు కర్నూ లు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ శనివారం పేర్కొన్నారు. ఇతర జిల్లాల నుంచి ఇప్పటి వరకు 9774 పరీక్ష జవాబు పత్రాలు వచ్చాయని తెలిపారు. ఇంగ్లీషు సబ్జెక్టు పరీక్ష జవాబు పత్రాలు రావాల్సి ఉందన్నారు.

ట్యాబ్ బేస్డ్ వాల్యుయేషన్ కోసం అసిస్టెంట్ ఎగ్జామినర్స్, చీఫ్ ఎగ్జామినర్లు మొత్తం 170 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 90 మంది ని, ముగ్గురుని క్యాంప్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. ఈ నెల 8న ఉదయం 8 గంటలకు విధిగా పది స్పాట్ వాల్యు యేషన్ కేంద్రంలో ఏఈలు, సీఈలు, స్పెషల్ అసిస్టెంట్లు కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో రిపోర్టు చేసుకోవా లన్నారు.

బోర్డు నిర్ణయించిన నిర్ణీత సమయంలో మూల్యాంకన శిబిరం పూర్తి చేసేందుకు డీఈవో సుధాకర్ ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు డ్యూటీ ఉత్వర్వులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## హిమామ్ పసంద్ -రూ.1.2 లక్షలు

**బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో ఊపందుకున్న మామిడి వ్యాపారం**



చిత్తూరు(చైతన్యరథం): బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి వ్యాపారం ఊపందుకుంది. గత శుక్రవారం టేబుల్ రకాలైన హిమామ్ పసంద్ టన్ను రూ.72 వేల నుంచి రూ.1.2 లక్షలు పలకగా కవరు కట్టిన బేనీషా రూ.35 వేల నుంచి రూ.42 వేలు, కవరు కట్టని బేనీషా రూ.16 వేల నుంచి 26 వేల వరకు ధర పలికింది. నాణ్యమైన మల్గూబా టన్ను రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు ధర పలికింది. కవరు కట్టిన మల్లిక టన్ను రూ.25 వేల నుంచి 35 వేలు, కాలేపాడు రూ.25 వేల నుంచి 45 వేలు.. కవరు కట్టిన ఖాదర్ రకం రూ.40 వేల నుంచి 45 వేల రూపాయలు పలికింది. గుజ్జు పరిశ్రమకు తరలించే ఖాదర్ రకం టన్ను రూ.18 వేలు.. చందూరా రూ.7 వేల నుంచి రూ.15వేలకు అమ్ముడుపోయింది. గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి టన్ను రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. నేరుగా ఫ్యాక్టరీలకు తరలిస్తే రూ.7 వేలు ఇస్తున్నట్లు రైతులు చెప్పారు. టేబుల్ వెరైటీలను కొనడానికి ఢిల్లీ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొంటున్నారు.

## పెదపెంకి ఫైలేరియా సమస్యకు శాశ్వత పరిష్కారం

# రూ.6.18 కోట్లతో మ్యాజిక్ డ్రైన్లు

**జనాభా తగ్గుదలకు చెక్: డిప్యూటీ సీఎం పవన్**






అమరావతి (చైతన్య రథం): పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకి గ్రామంలో నెలకొన్న సామాజిక అంతరాల వల్ల యావత్ గ్రామమంతా భయానక ఫైలేరియా వ్యాధి బారిన పడిన వైనం 2018లోనే తన దృష్టికి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. యంత్రాంగం సమిష్టిగా పని చేస్తే ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా సానుకూలంగా, సావధానంగా ఎలా పరిష్కరించవచ్చో పెదపెంకి గ్రామంలో చేపట్టిన సమగ్ర అభివృద్ధి ద్వారా నిరూపించామని చెప్పారు. మన్యం జిల్లా, పెదపెంకిలో భారీగా నమోదైన ఫైలేరియా కేసులు, ఆ గ్రామంపై పెట్టిన ప్రత్యేక శ్రద్ధ, సాగుతున్న పనులపై జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, సామాజిక అంతరాల వల్ల గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లోని మురుగు నీరు బయటకు వెళ్లకుండా ఒకే దగ్గర నిల్వ ఉండిపోయిందని, ఫలితంగా క్యూలెక్స్ దోమలు అధికమై గ్రామంలోని వారంతా వ్యాధి బారిన పడ్డారని వివరించారు. గ్రామ జనాభా ఒకప్పుడు 7,900 ఉండగా, ఫైలేరియా కేసులు అధికంగా నమోదు కావడం వల్ల పదేళ్లలో జనాభా 12 శాతం తగ్గిందని, చాలామంది వ్యాధులకు బయటపడి వలస వెళ్లిపోయారని తెలిపారు. అధికారంలోకి రాగానే పెదపెంకి మీద ప్రధానంగా దృష్టి సారించామని, జిల్లా యంత్రాంగంతో మాట్లాడి కారణాలను తెలుసుకున్నామని ఆయన వివరించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి డ్రైన్ల ఆక్రమణలు తొలగించామని, నరేగా నిధులు రూ.6.18 కోట్లతో మ్యాజిక్ డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. 20 మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం ద్వారా గ్రామంలో ఇప్పుడు స్వచ్ఛమైన వాతావరణం కనిపిస్తోందని, సమస్య కూడా పూర్తి అదుపులోకి వస్తుందని భావిస్తున్నానని ఆయన అన్నారు.

గ్రామ జల్లెడ పట్టడంలో డ్రైనేజీ ఆక్రమణలు, డ్రైనేజీలకు సరైన ముగింపు లేకపోవడం వంటి అంశాలు బయటపడ్డాయని, ఫైలేరియాతో పాటు చికన్ గన్యా, డెంగీ వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వాలు మురుగులో అధికంగా కనిపించాయని వివరించారు. మొదట అభివృద్ధిని వ్యతిరేకించిన గ్రామస్థులే ఇప్పుడు ఫలితాలను చూసి ప్రభుత్వాన్ని, అధికారులను మెచ్చుకోవడం సాధారణ విషయం కాదని ఆయన అన్నారు. త్వరలో గ్రామాన్ని స్వయంగా సందర్శిస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డికి, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# 'సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం

**రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత**





తాడేపల్లి/ అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు వస్తున్నాయన్నారు. తాడేపల్లిలోని ఎపిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందని, వాటివల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులు లేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎపిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

**సైకిల్‌పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి..**

అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో ఎపిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయశాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామపండ్లను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్‌నే వినియోగించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డువద్ద ఉన్న చలివేంద్రంవద్ద ఆగి మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎపిస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# సీమను తాకిన నైరుతి



- రెండు మూడు రోజుల్లో మరింత విస్తరణ
- 58 మండలాల్లో తీవ్ర వడగాల్పుల హెచ్చరిక

అమరావతి (చైతన్య రథం): ఐఎండి సమాచారం, ఆర్టీజీఎస్-అవేర్ పోర్టల్ విశ్లేషణ ప్రకారం శనివారం నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ రాయలసీమ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు తాకినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రానున్న రెండు మూడు రోజులు రాష్ట్రంలో మరింత విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో కురిసే మొత్తం వర్షపాతం సాధారణ స్థాయి కంటే కొంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, అయితే స్థానిక వాతావరణ మార్పుల వల్ల కురిసే వర్షాలు ఈ లోటును కొంత మేరకు భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. ఈసారి రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని, అంటే కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసి మరికొన్ని రోజుల పాటు వాతావరణం పొడిగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతులు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా తమ పంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

జిల్లాలవారీగా వర్షపాత సూచనలు:

నైరుతి రుతుపవనాల సీజన్‌లో (జూన్-సెప్టెంబర్ 2026) పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంతపురము, వైఎస్సార్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణంకంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో సాధారణ వర్షపాతం కురిసే అవకాశం ఉందన్నారు.

నేడు, రేపు వాతావరణం

ఆదివారం పల్నాడు, మార్కాపురం, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 12 మండలాలు, విజయనగరం 22, మన్యం 12, అల్లూరి 1, పోలవరం 2, విశాఖ 1, కాకినాడ 8 మొత్తంగా 58 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 104 మండలాల్లో వడగాల్పుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42-44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

సోమవారం కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

శనివారం రికార్డు ఉష్ణోగ్రతలు

శనివారం కృష్ణా జిల్లా పెదపారుపూడి, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 43.9, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 43.4, అనకాపల్లి జిల్లా మాకవరపాలెం, నెల్లూరు జిల్లా గూడూరు, తిరుపతి జిల్లా ఓజిలిలో 43.2, మన్యం జిల్లా నవగాంలో 43.1, బాపట్ల జిల్లా కారంచేడు, విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసలో 43 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డు అయిందని తెలిపారు.

ఆకస్మికంగా ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# మొదలైన యోగాంధ్ర-2026

**- కార్యాచరణకు కూటమి సర్కారు శ్రీకారం**

**- గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు నాలుగంచెల పోటీలు**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో యోగాంధ్ర-2026 ఉద్యమ కార్యాచరణకు కూటమి ప్రభుత్వం శనివారం నుంచి శ్రీకారం చుట్టింది. యోగాంధ్ర పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి నుంచి మొదలైంది. యోగా మాస్టర్ ట్రైనర్లు సుమారు 2 వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని దేవాలయ ప్రాంగణంలో యోగాసనాల రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించబోతున్నారు. దీనికి అనుగుణంగా 5 జిల్లాల్లో యోగాసనాల కార్యక్రమాలు జరగబోతున్నాయి. ఆదివారం నుంచి ఆరోగ్య సంరక్షణలో యోగాసనాల ప్రాధాన్యం తెలిపేలా రకరకాల ఇతివృత్తాల ఆధారంగా విద్యార్థులకు వివిధ పోటీలు జరగబోతున్నాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ నెల 20 వరకు నిరాశీటకంగా జరుగుతాయని ప్రకటనలో తెలిపారు.

**నాలుగు అంచెల పోటీలు:**

14 రోజుల పాటు నాలుగు వేర్వేరు స్థాయిలలో పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. గ్రామ/వార్డు స్థాయిలో జూన్ 7 నుంచి జూన్ 9 వరకు, మండల స్థాయిలో జూన్ 10 నుంచి జూన్ 12 వరకు, జిల్లా స్థాయిలో జూన్ 14 నుంచి జూన్ 16 వరకు, జూన్ 18 నుంచి జూన్ 20 వరకు యోగాంధ్ర గ్రాండ్ ఫినాలె పోటీలను నిర్వహిస్తారు. గ్రామ/వార్డు స్థాయిలో విజేతలుగా నిలిచిన వారే వరుసగా మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.

**పోటీల వివరాలు:**

వ్యక్తిగత ప్రదర్శనల విభాగంలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామ ప్రదర్శన ఉంటుంది. సమూహ ప్రదర్శనల విభాగంలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా నిర్వహిస్తారు. కళాత్మక విభాగంలో యోగా సాంగ్ (తెలుగులో సొంత కవిత్వం/పాట), యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫోటోగ్రఫీ ఉంటాయి. అలాగే యోగా క్విజ్, యోగా స్లోగన్ (నినాదాలు), యోగా వ్యాస రచన పోటీలు ఉంటాయి. జూనియర్స్ (10నుండి 18 సంవత్సరాలు), యువకులు (19నుండి 35 సంవత్సరాలు), సీనియర్స్ (36 సంవత్సరాల పైబడిన వారు) విభాగాల్లో మహిళలకు, పురుషులకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తారు.

ప్రతి ఆసనాన్ని కనీసం 5 సెకన్ల పాటు స్థిరంగా ప్రదర్శించాలి. ఒక ఆసనం నుండి మరొక ఆసనంలోకి మారే ప్రక్రియ నెమ్మదిగా, శోభాయమానంగా సాగాలి. మొత్తం ప్రదర్శన సమయం రెండున్నర నుంచి మూడు నిమిషాల పాటు ఉంటుంది. గ్రామ స్థాయిలో వృక్షాసనం, పాదహస్తాసనం, ఉష్ట్రాసనం, అర్ధమత్స్యేంద్రాసనం, సర్వాంగాసనం, త్రికోణాసనం వంటి ప్రాథమిక ఆసనాలను వయస్సును బట్టి ప్రదర్శించాల్సి ఉంటుంది. స్థాయి పెరిగే కొద్దీ ఆసనాల క్లిష్టత పెరుగుతుంది.

**పాల్గొనడం ఎలా?**

పోటీలలో పాల్గొనాలనుకునే అభ్యర్థులందరికీ ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. "యోగాంధ్ర" పోర్టల్‌లో పేర్కొన్న వివరాలను పూర్తి చేసి పేరు నమోదు చేసుకోవాలి. అభ్యర్థులు తమ పరిధిలోని గ్రామ/ వార్డు సచివాలయాలను లేదా అధికారులను సంప్రదించి కూడా నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థి వయస్సు, పేరు నిర్ధారించడానికి ఐడీ కార్డ్ లేదా సర్టిఫికేట్ వెరిఫికేషన్ తప్పనిసరిగా అందజేయాలి. మైనర్ అభ్యర్థులైతే తల్లిదండ్రులు/ గార్డియన్ అండర్‌టేకింగ్ సంతకం చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తాము నివసిస్తున్న ప్రాంతంలోనే పోటీ చేయడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, డిగ్రీ కళాశాల మైదానాలు, కమ్యూనిటీ హాళ్లలో పోటీల వేదికలను ఏర్పాటు చేస్తున్నారు.

# భూవివాదాలు, అన్యాయాలపై గళమెత్తిన బాధితులు

- **టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం**
- **నలభై ఏళ్ల సాగుపై రీసర్వే దెబ్బ**
- **బతుకుదెరువుకు వలసపోతే... భూమిని కాజేశారు**
- **డబుల్ రిజిస్ట్రేషన్ మోసం -ఏళ్ల పోరాటానికి న్యాయం దక్కలేదు**



అమరావతి (చైతన్య రథం): కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు వెల్లడించారు. భూ అక్రమాలు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, వైసీపీ నేతల వేధింపులు సహా పలు అంశాలపై అర్జీలు అందజేశారు.

**వైసీపీ నేత వేధింపులు -కోర్టు తీర్పునూ లెక్కచేయడం లేదు**

సత్యసాయి జిల్లా కదిరి మండలం కుటగుళ్ళ గ్రామానికి చెందిన చెన్నమ్మ తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 969, 370, 369లలో మొత్తం 1 ఎకరం 12 సెంట్ల సొంత భూమి ఉందని, ఈ భూమి విషయంలో గత కొన్ని ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కదిరి కోర్టు సగం భాగం భూమిపై తమకు అనుకూలంగా స్పష్టమైన తీర్పు ఇచ్చినా స్థానిక వైసీపీ నాయకుడు కేవీ రామచంద్రారెడ్డి దానిని ఖాతరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టుకు వెళ్లి తమను మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నాడని, తమకు అండగా ఎవరూ లేకపోవడంతో తన ఇద్దరి కుమార్తెలపై దౌర్జన్యానికి దిగుతున్నాడని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ని పర్యాయాలు సంప్రదించినా పట్టించుకోలేదని, తమపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మంత్రిని కోరారు.

**నలభై ఏళ్ల సాగుపై రీసర్వే దెబ్బ -వైసీపీ మద్దతుదారులకు రాత్రికి రాత్రే పట్టాలు**

కృష్ణా జిల్లా గన్నవరం మండలం గోపవరపుగూడెం గ్రామానికి చెందిన వెంకటరత్నం అర్జీలో, గొల్లనపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 12, 27, 87లలో ఉన్న కొండ పోరంబోకు భూముల్లో దాదాపు 22 మంది దళిత, పేద రైతులు సుమారు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో తీవ్ర అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. నలభై ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతుల పేర్లను అడంగల్, పహాణీల నుంచి తొలగించి ఆ భూములను 22/ఏ జాబితాలో పెట్టారని, అదే సమయంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న కొంతమంది వ్యక్తులకు లబ్ధి చేకూరుస్తూ వారి పేర్లను అడంగల్‌లో చేర్చి రాత్రికి రాత్రే పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేశారని ఆరోపించారు. ఒకే సర్వే నంబర్ల పరిధిలో వైసీపీ మద్దతుదారులకు న్యాయం చేసి పేదలకు అన్యాయం చేశారని, వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**బతుకుదెరువుకు వలసపోతే... ఉన్న భూమిని కాజేశారు**

మార్కాపురం జిల్లా హనుమంతునిపాడు మండలం వాలిచర్ల గ్రామానికి చెందిన రంగలక్ష్మి అర్జీలో, సర్వే నంబర్లు 41, 42లలో 1.35 సెంట్ల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. కుటుంబ బ్రతుకుదెరువు నిమిత్తం తెలంగాణ వెళ్ళిన సమయంలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేకపోవడంతో భూమిని వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయించుకోలేకపోయారు. దీనిని ఆసరాగా చేసుకుని తమకు భూమిని అమ్మిన వారి కుమారులు అక్రమ మార్గాల్లో ఆ భూమిని వారి పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆరోపించారు. తహశీల్దార్ కార్యాలయంలో, ఆర్డీఓ వద్ద లిఖితపూర్వకంగా దరఖాస్తులు సమర్పించినా అధికారులు మొర ఆలకించకుండా అక్రమార్కులకే కొమ్ముకాస్తున్నారని పేర్కొంటూ న్యాయం చేయాలని కోరారు.

**సింగరాయకొండలో స్థల వివాదం -స్వాధీనానికి వెళ్తే దూషణలు, బెదిరింపులు**

ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన రమణాచారి అర్జీలో, 07-12-2023న జమ్మలమడక జ్ఞానయ్య కుమారుడు ఆనందబాబు వద్ద నుంచి 461 చదరపు గజముల స్థలాన్ని రూ.5,50,000కు కొనుగోలు చేశానని, దీనికి సంబంధించిన పూర్తి మొత్తం చెల్లించి అన్ని లీగల్ డాక్యుమెంట్లు, హక్కులు తన వద్దే ఉన్నాయని తెలిపారు. అయితే స్థలం స్వాధీనానికి వెళ్తే శీలం రమణయ్య, అతని కుమారుడు శీలం జగదీష్ అనే వ్యక్తులు తనను, కుటుంబ సభ్యులను స్థలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, రౌడీయిజం చేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని తమ స్థలం అప్పగించాలని కోరారు.

డబుల్ రిజిస్ట్రేషన్ మోసం -ఏళ్ల పోరాటానికి ఇంకా న్యాయం దక్కలేదు

పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన భారతలక్ష్మి అర్జీలో, తమ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 102/ఏ లో ప్లాటు నెం. హెచ్4 (4 సెంట్లు) 2015లో తమ పేరిట రిజిస్ట్రేషన్ అయిందని తెలిపారు. 2017లో ఆ ప్లాటును పక్కనున్న హెచ్5తో కలిపి 'ప్లాట్ నెం. 4, 5'గా మార్చి హైదరాబాద్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్‌కు డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఆరేళ్లు కోర్టులో పోరాడి ఆగస్టు 2025లో అనుకూల తీర్పు వచ్చినా సత్తెనపల్లి ఆర్డీఓ 4 నెలల్లో రీసర్వే చేయాల్సి ఉందని, ఆర్డీఓ బదిలీ అయ్యారని, కొత్త ఆర్డీఓ బాధ్యతలు తీసుకోలేదని సాకులు చెప్తూ స్థలం అప్పగించడం లేదని పేర్కొంటూ న్యాయం చేయాలని కోరారు.

**భర్త పోతే... అత్తమామలు ఇంటి నుంచే వెళ్లగొట్టారు**

గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన బెలావతి అర్జీలో, రోడ్డు ప్రమాదంలో భర్త దుర్గాప్రసాద్ అకాల మరణం తర్వాత 3 ఎకరాల పొలం, 2 ఇళ్ల స్థలాలు, 2 సెంట్ల ఖాళీ స్థలం సహా మామగారి పేరిట ఉన్న ఆస్తిలో చనిపోయిన కొడుకు భాగాన్ని మనవడి పేరిట రాసిస్తామని పంచాయితీలో అత్తమామలు ఒప్పుకున్నారని తెలిపారు. అయితే ఏడాది గడిచినా ఆస్తి రాయలేదని, ఆస్తి గురించి అడగడంతో అత్తమామలు "నీకు ఆస్తి ఇచ్చేది లేదు, నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకో" అంటూ అవమానిస్తూ తనను, కొడుకును బలవంతంగా ఇంటి నుంచి వెళ్లగొట్టి పుట్టింటికి పంపించేశారని ఆరోపించారు.

**కోర్టు తీర్పు ఉన్నా మ్యుటేషన్ చేయని అధికారులు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం జడదేవి గ్రామానికి చెందిన సరోజిని అర్జీలో, సర్వే నంబర్ 119-16లో 42 సెంట్ల భూమిలో వివాదం పూర్తిగా పరిష్కారమై న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా మ్యుటేషన్ చేయాల్సిన అధికారులు గత సంవత్సరం కాలంగా సాంకేతిక కారణాలు సాకుగా చూపుతూ ప్రక్రియను నిలిపివేశారని వివరించారు. తక్షణమే పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేయాలని కోరారు.

**ఇతర ఫిర్యాదులు:**

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం శలపాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం సర్వే నంబర్ 694/2దీలో 2 ఎకరాల 37 సెంట్ల సొంత పట్టా భూమికి ఇంతవరకు పట్టాదార్ పాస్ పుస్తకం అందలేదని, దీనివల్ల రైతు భరోసా, పంట రుణాలు, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు పొందలేకపోతున్నానని తెలిపారు.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రేపూరి అబ్రహం 1.60 ఎకరాల డి.కె. పట్టా భూమిని లీజుకు ఇచ్చిన ఆక్వా కంపెనీలు 'లైలా తుఫాను'లో లీజు పత్రాలు పాడైపోయిన విషయం తెలుసుకుని గడువు ముగిసినా భూమి తిరిగి ఇవ్వడం లేదని, దళితులకు సంబంధించిన సుమారు 147 ఎకరాల భూమిని అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నోటీసులు ఇచ్చి ఏడాది గడిచినా రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు వారిని నిలుపుదల చేయలేకపోయారని పేర్కొన్నారు.

పల్నాడు జిల్లా క్రోసూరుకు చెందిన అన్నపూర్ణ పాసపాడు గ్రామంలో సర్వే నంబర్ 46లో ప్రభుత్వ రికార్డులు, వాస్తవ విస్తీర్ణానికి తేడా వస్తూ 50 సెంట్లు తక్కువగా చూపిస్తున్నారని ఇబ్బంది పడుతున్నారు.

ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చలపతిరావు సర్వే నంబర్ 556/2లో 2 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ అయినా వెబ్‌ల్యాండ్‌లో ఆన్‌లైన్ కాకపోవడంతో 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తించడం లేదని వివరించారు. వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు ఆర్థిక తోడ్పాటు కల్పించాలని అభ్యర్థించగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు అందజేశారు.

## యాంటి డ్రగ్ పార్క్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్



విశాఖపట్నం (చైతన్యరథం): యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా, సన్మార్గంలో పయనించేలా నిర్మించ ప్రతిపాదించిన యువగళం యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం విశాఖ సెంట్రల్ పార్క్ ఆవరణలో యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణం చేపడుతున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. దేశంలో మొదటిసారిగా ఒక మంచి సామాజిక అంశంతో ఈ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. విశాఖ యువతలో చైతన్యం తీసుకువచ్చేలా పార్క్ నిర్మాణం జరగాలని, ఆగస్టు నాటికి పార్క్ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పార్క్ అనేది ఆహ్లాదం కోసం మాత్రమే కాకుండా అవగాహన కలిగించేలా ఉండాలని సూచించారు. పార్క్ ఆవరణలో సోలార్ దీపాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు VMRDA ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని పార్కుల్లో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే విధంగా నెట్‌జీరో విధానం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఓఎస్డీ కృష్ణ నాయక్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, జీజా సింగ్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రంపచోడవరం టీడీపీలోకి చేరికలు

**• పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మిర్యాల శిరీష**



చింతూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలోకి వైసీపీ కార్యకర్తలు చేరడం ఆనందంగా ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష వ్యాఖ్యానించారు. శనివారం చింతూరు మండల పరిధిలోని కల్లేరు పంచాయతీ మధుగురు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ... నమ్మకంతోనే ఇంత పెద్ద ఎత్తున పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి, మధుగురు గ్రామ సమగ్ర అభివృద్ధికి కొత్తగా చేరిన వారందరితో కలిసికట్టుగా ముందుకు సాగుతామన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతూరు మాజీ మండల అధ్యక్షులు జహంగీర్ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సల్మాన్ రాజు, చింతూరు మండల మహిళా కార్యదర్శి పోడియం సావిత్రి, సత్తిబాబు, చింతూరు మాజీ సర్పంచ్ సోడే శ్రీను మరియు మధుగురు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సే ధ్యేయం: ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

**•జామి మండలంలో 404 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ**



జామి (చైతన్యరథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం జామి మండలం గొడికొమ్ము గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 404 మంది రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో భూ సమస్యలు, పాసుపుస్తకాల మంజూరులో ఎదురైన జాప్యం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. పాసు పుస్తకాలపై జగన్ బొమ్మలు వేసుకొని రైతులను అన్యాయం చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో పాసు పుస్తకాలు అందిస్తోందని చెప్పారు. రైతుల ఇబ్బందులను తొలగించి, అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో హక్కు పత్రాలు అందించాలనే ఉద్దేశంతో రెవెన్యూ యంత్రాంగం వేగంగా చర్యలు తీసుకుందని అభినందించారు. రైతుల ముఖాల్లో ఆనందం చూడటం ఎంతో సంతోషాన్నిస్తోందని, నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు.

## లివర్ బాధితురాలికి ఎమ్మెల్యే పల్లా రూ.10 లక్షల ఎల్వోసీ



విశాఖపట్నం (చైతన్యరథం): సీఎంఆర్ఎఫ్ పేదలకు భరోసాగా నిలుస్తోందని గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. గాజువాక నియోజకవర్గం 72వ వార్డు శ్రీనగర్ ఆఫీషియల్ కాలనీ ప్రాంతానికి చెందిన ఎలిమిశెట్టి బాహ్యప్రియ గత కొద్ది కాలంగా కాలేయ వ్యాధి సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బాధితురాలిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితులు గురించి ఆరా తీశారు. పేద కుటుంబానికి చెందిన ఎలిమి శెట్టి బాహ్యప్రియకు అండగా నిలవాలని భావించిన ఆయన... తన రిఫరెన్స్ లెటర్ ద్వారా రూ.10 లక్షల ఎల్వోసీ కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. స్పందించిన సీఎం కార్యాలయ సిబ్బంది ఆమెకు శస్త్ర చికిత్స నిమిత్తం 10 లక్షల మంజూరు చేశారు. ఎల్వోసీ ద్వారా మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బాధితురాలికి చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు



రాజానగరం (చైతన్యరథం): చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ప్రారంభమయ్యాయి. జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాష మాధుర్యాన్ని గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయడం ప్రతి తల్లి, తండ్రి బాధ్యత అన్నారు. భాషాభిమానులు, సాహితీవేత్తలు, కవులు కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకురావాలన్న సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ మహాసభలు తెలుగు భాషాభివృద్ధికి కొత్త వెలుగు అన్నారు. భాష బతికితేనే సంస్కృతి బతుకుతుందని, సాహిత్యం కళల వల్లే సమాజం చైతన్యవంతం అవుతుందని ఆయన అన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని 23వ వార్డులో దివంగత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఏపీ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి చేతుల మీదుగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్ల వయసులో ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తనకు ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చారని, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే సీఎంగా అధికారం చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. సినీ, రాజకీయ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని, ఇప్పటికీ ప్రజలు ఎన్టీఆర్‌ను దేవుడిలా కొలుస్తూ విగ్రహాలు పెట్టుకోవడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## న్యూజిలాండ్‌లో సైకిల్ యాత్ర చేపట్టిన ఎంపీ కలిశెట్టి



న్యూజిలాండ్ / విజయనగరం (చైతన్యరథం): ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూజిలాండ్‌లో ఎన్నారై టీడీపీ మిత్రుడు వేణు సోమేపల్లితో కలిసి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన సైకిల్ యాత్ర స్ఫూర్తితో, ఆరోగ్యం - ఆనందం - పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైకిల్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఇంధన వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం సైకిల్‌ను వినియోగించాలని, ముఖ్యంగా చిన్నచిన్న పనుల కోసం వాహనాలకు బదులుగా సైకిల్‌ను ఉపయోగించే అలవాటు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలలో కనీసం ఒక రోజును పూర్తిగా సైకిల్‌కే అంకితం చేస్తూ, ఆ రోజు ఇతర వాహనాలను ఉపయోగించకుండా సైకిల్‌తోనే ప్రయాణించాలని తాను సంకల్పించుకున్నట్లు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

## చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిమ్మక భూమి పూజ



వీరఘట్టం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం పట్టణంలో ఉల్లివాని లక్ష్మీనారాయణ కోనేరు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిమ్మక జయ కృష్ణ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చెరువుగట్టు బలోపేతం, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సౌర బల్బులు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ మూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, ఏపీవో జి. సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల శ్రమకు గుర్తింపు : మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): పేదల సేవే పరమావధిగా భావిస్తూ పాలకొల్లు నియోజకవర్గంలో ఉపాధి హామీ శ్రామికుల శ్రమను గుర్తించి గౌరవించడం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం చందపర్రు గ్రామంలో 40 రోజులుగా మండుటెండలో పనిచేసిన శ్రామికులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ ముగింపు కార్యక్రమం కేవలం భోజనాలకు పరిమితం కాదని, శ్రమకు ఇచ్చిన గుర్తింపు, కార్మికుల పట్ల ఉన్న మానవీయతకు నిదర్శనమని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. శ్రామికులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లక్కీ డ్రా ద్వారా మహిళలకు చీరలు అందజేశారు. తన పిలుపుతో వేసవిలో మండుటెండలో పనిచేస్తున్న శ్రామికులకు దాతల సహకారంతో 40 రోజులుగా అన్ని గ్రామాల్లో మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# విజయవాడను స్పోర్ట్స్ సిటీగా తీర్చిదిద్దుతాం : ఎంపీ కేశినేని

**●ఆధునికరణతో ఇండోర్ స్టేడియంను రాష్ట్రంలోనే ఆదర్శ క్రీడా వేదికగా మారుస్తాం**




విజయవాడ (చైతన్యరథం): భవిష్యత్తులో విజయవాడను రాష్ట్రంలోనే ప్రముఖ "స్పోర్ట్స్ సిటీ"గా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు."విజయవాడ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదనీ క్రీడల్లోనూ విజయవాడకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం అనీ యువత కలలను సాకారం చేసే స్పోర్ట్స్ హబ్‌గా విజయవాడను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాను" అని ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. శనివారం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత వ్యక్తిత్వ వికాసంలో క్రీడల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విజయవాడలోని యువ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించేందుకు అత్యుత్తమ క్రీడా వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించినట్లు తెలిపారు. "పీవీ సింధు స్థాయి క్రీడాకారులు మాత్రమే కాదనీ ఆమె స్ఫూర్తితో మన గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించే ప్రతిభావంతులు వెలుగులోకి రావాలన్నారు. వారికి కావాల్సిన వేదికలు, శిక్షణా సదుపాయాలు, ప్రోత్సాహం అందించడం మన బాధ్యత" అని ఎంపీ పిలుపునిచ్చారు. బ్యాడ్మింటన్ రంగంలో చేతన్ ఆనంద్, పీ.వి.వి. లక్ష్మి, రుత్వికా శివాని, మేఘనా జక్కంపూడి, సూర్య చరిష్మ వంటి ప్రతిభావంతులను అందించిన విజయవాడ, రాబోయే రోజుల్లో మరింత మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇండోర్ స్టేడియాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, క్రీడాకారులు అత్యుత్తమ వాతావరణంలో సాధన చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రీడలకు సంబంధించిన మౌలిక వసతుల విస్తరణ, శిక్షణా సదుపాయాల మెరుగుదల కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

# నగరంలో ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం

**●రాజమహేంద్రవరంలో చైతన్య ఆసుపత్రి వద్ద రూ.4.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో ముంపు సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, అవసరమైన చోట్ల డ్రెయినేజీ వ్యవస్థను బలోపేతం చేస్తూ వరద నీటి నిల్వలను నివారించే చర్యలను వేగవంతం చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక 38వ డివిజన్ పరిధిలోని లలితానగర్ చైతన్య ఆసుపత్రి సమీపంలో రూ.4.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న 300 మిల్లీమీటర్ల సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ నగరంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. లలితానగర్ ప్రాంతంలో చాలా కాలంగా డ్రెనేజీ నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ సీసీ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షపు నీరు, మురుగునీరు సులభంగా పారిపోయేలా ఏర్పాట్లు జరుగుతాయని, దీంతో రహదారులపై నీరు నిల్వ ఉండే సమస్య తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డుల వారీగా అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం, స్థానిక సంస్థల సమన్వయంతో నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం రూరల్: విశాఖ వీఎంఆర్డీఏ మంజూరు చేసిన రూ.10 కోట్లతో విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు శనివారం విజయనగరం ఆర్ అండ్ బీ రైతు బజార్- చేపల మార్కెట్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎండీ తేజ్భరత్తు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయనగరం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతో రూ. కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేశ్ వర్మ, కూటమి నేతలు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశం

**●ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.111కోట్ల చెక్కును అందజేసిన మంత్రి కొండపల్లి**

**●రావులపాలెంలో రూ.1.52 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు**



రావులపాలెం (చైతన్యరథం): ప్రతీ కుటుంబంలోనూ ఆర్థిక అభివృద్ధి జరగాలనేదే కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎమ్ఎస్ఎమ్ఈ, సెర్ప్, గ్రామీణ అభివృద్ధి పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రావులపాలెంలో శనివారం జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిసి పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి శ్రీనివాస్ వీజీబీరామ్ జీ నిధులు రూ. 1కోటితో జూనియర్ కళాశాల నుంచి శ్మశాన వాటిక వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీజీబీరామ్ జీ నిధులు రూ.40 లక్షలతో 6వ వార్డులో వాటర్ ట్యాంకు వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ నిధులు రూ.12లక్షలతో కాపు కళ్యాణ మండపం నుంచి గోలి సత్యవతి ఇంటి వరకు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రారంభించారు. అనంతరం రావులపాలెంలో జరిగిన సభలో ఎమ్ఎస్ఎమ్ఈ ద్వారా 82 మందికి రూ.4.86 కోట్లు, పీఎంఏజేవై 30 మందికి రూ.33 లక్షలు, ట్రెకెర్ ముగ్గురికి రూ.3 లక్షలు, 588 గ్రూపులకు బ్యాంకు లింకేజ్ రూ.106 కోట్లు, మొత్తం రూ.111.19 కోట్ల విలువైన చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సీనియర్ బండారు సత్యానందరావు ఎమ్ఎస్ఎమ్ఈలను ప్రోత్సహించడంలో వినూత్నంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో రావులపాలెంలో ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, ఇద్దరు ఉద్యోగులను నియమించి కొత్త కొత్త ఆలోచనలతో ఎవరు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చినా, వారికి తగిన సహకారం అందించేలా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 2047 విజన్‌లో భాగంగా భారతదేశ జీడీపి అభివృద్ధి చెందాలి అంటే గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతి కుటుంబంలోనూ ఆర్థిక అభివృద్ధి జరగాలనేది ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల ఆలోచన అన్నారు. భారతదేశంలోని ప్రజలకు అవసరమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడంతో పాటు, ఎగుమతులను సైతం ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఒక్క ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే చేస్తుందన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన రాష్ట్రంలో మాత్రమే ఈ విధమైన దృక్పథం కనబడుతుందన్నారు. మన యువతకు అవకాశాలు రావాలనేది యువ నాయకులు నారా లోకేష్ ఉద్దేశం అన్నారు.

# దుర్బుద్ధి, దుర్మార్గపు ఆలోచనతోనే డీఎస్సీపై జగన్ విషప్రచారం

**●అమరావతి, డీఎస్సీపై వేసిన వైసీపీ కమిటీలు .. జగన్ విద్వేష రాజకీయాల్లో భాగమే : ప్రత్తిపాటి పుల్లారావు**

చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేకే జగన్, ముగిసిపోయిన అంశాలపైనా కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని, డీఎస్సీ జరగకూడదన్న దురుద్దేశంతో 250 వరకు తప్పుడు కేసులు కోర్టుల్లో వేయించిన జగన్, నేడు డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం సిగ్గుచేటని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్ని వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగాడీఎస్సీ నిర్వహణలో లోకేశ్ కృషి, సమర్థత ఎంతో ఉందన్న ప్రత్తిపాటి, జగన్ వేయించిన తప్పుడు కేసుల్ని పరిష్కరించి, 16,347 పోస్టుల్ని భర్తీ చేసి, చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నడూ లేనివిధంగా ప్రజల సమక్షంలో ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందించారన్నారు. తాను అమలు కాకుండా చేద్దామనుకున్న డీఎస్సీని లోకేశ్ సాకారం చేశాడన్న అక్కసు, అసూయతోనే జగన్ ఇప్పుడు విషప్రచారం చేస్తున్నాడన్నారు. ఐదేళ్లు యువతను మోసగించి, దగా డీఎస్సీ, ఉత్తుత్తి జాబ్ క్యాలెండర్‌తో వంచించిన జగన్, లోకేశ్ సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమిప్రభుత్వానికి పేరు రాకూడదనే జగన్ డీఎస్సీని అడ్డుకున్నాడన్నారు. దొంగలు పడ్డ ఆర్నెల్ల సామెత తీరుగా వైసీపీ తీరుందని, ఎప్పుడో పూర్తైన డీఎస్సీపై ఇప్పుడు కోర్టులను ఆశ్రయించడం. గవర్నర్‌కు ఫిర్యాదుచేయడం ఏంటని ప్రత్తిపాటి ప్రశ్నించారు.

**అభివృద్ధి, పాలనా విజయాలు ప్రజలకు తెలియచేసేందుకే బహిరంగ సభలు**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి, ప్రజలకు అందుతోన్న సంక్షేమం, ఇతర విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే భారీ బహిరంగసభలు నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు.

## దేవాలయ సమస్యకు టీడీపీ నేత శాశ్వత పరిష్కారం



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ 2వ డివిజన్ కుమ్మరి బజార్‌లోని పాండురంగ స్వామి దేవాలయ మండపంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానికులు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వెంటనే గుర్తించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచనల మేరకు టీడీపీ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ రూ.25 వేల విలువైన సబ్ మెర్సీబిల్ మోటార్‌ను సొంత నిధులతో కొనుగోలు చేసి శనివారం నాడు దేవాలయ కమిటీ వారికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... దేవాలయానికి వచ్చే భక్తులు, ఆలయ కార్యక్రమాల నిర్వహణలో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ మోటార్ అందజేయడం జరిగిందని గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం కొనసాగుతుందని చెప్పారు.

## అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు

● అబద్ధాలను నిజాలుగా మార్చలేరు : టీఎన్‌టీయుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్



విజయవాడ (చైతన్యరథం): వైసీపీ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు అని టీఎన్‌టీయుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ వ్యాఖ్యానించారు. శనివారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎంపీ కేశినేని శివనాథ్‌పై కొంతమంది నిరాదరణ ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్త నిజం కాదని, కొందరు కావాలనే అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా పోలీస్ వ్యవస్థను, ప్రభుత్వ సంస్థలను విమర్శించడం బాధ్యతారాహిత్యమని, వాస్తవాలను తెలుసుకుని మాత్రమే నమ్మాలన్నారు. రాజకీయ ప్రచారాలను ఆధారంగా చేసుకుని పోలీసు శాఖపై అనవసర అనుమానాలు సృష్టించడం సరైంది కాదు. చట్టాన్ని అమలు చేయడం, ప్రజల భద్రతను కాపాడడం పోలీసుల బాధ్యత. అబద్ధపు ప్రచారాలను కాదు, నిజాలను మరియు ప్రజల కళ్ల ముందున్న వాటినే ప్రజలు విశ్వసిస్తారని పరుచూరి ప్రసాద్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న కేశినేని శివనాథ్‌ని వ్యక్తిగతంగా, రాజకీయంగా బురదజల్లే ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు. ఏ ఆరోపణకైనా ఆధారాలు ఉంటే సంబంధిత విచారణ సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. చట్టబద్ధమైన ఏ విచారణకైనా పూర్తిగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారాలు, ప్రభుత్వ శాఖల నిర్ణయాలు, పోలీసు వ్యవస్థలు, రెవెన్యూ భూ వివాదాలు, వ్యాపార సంస్థలకు సంబంధించిన అంశాలన్నీ ఆయా చట్టాలు మరియు నిబంధనల ప్రకారమే జరుగుతాయి. వాటికి రాజకీయ రంగు పులమడం అనే ఆలోచన దురదృష్టకరం. రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పరుచూరి ప్రసాద్ వ్యాఖ్యానించారు.

## నారా లోకేష్ చొరవతో చిలువూరు మైనార్టీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం... హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



మంగళగిరి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చొరవతో నియోజకవర్గం, దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామ మైనారిటీ కాలనీలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాలనీ రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రాంట్ కింద రూ.35 లక్షల వ్యయంతో 10 సీసీ రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ మైనారిటీ కాలనీలో ఇప్పటి వరకు సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు ఆటంకంగా నిలిచేవి. ఈ సమస్యను కాలనీ ప్రజలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి MGNREGS నిధుల ద్వారా రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో కాలనీలో 10 సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సమస్యను పరిష్కరించిన మంత్రి నారా లోకేష్‌కు కాలనీవాసులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశలను కార్యరూపంలో పెడితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

● నారాకోడూరులో సమృద్ధి కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల



గుంటూరు జిల్లా (చైతన్యరథం): నారాకోడూరులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించిన సమృద్ధి కేంద్రాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర శనివారం ప్రారంభించారు. ఆశలను అవకాశాలుగా మార్చుకున్నప్పుడే గ్రామీణ అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆ స్వప్నాలకు నారాకోడూరు నాంది పలికింది అని పెమ్మసాని పేర్కొన్నారు. భారత్ నెట్ ఉద్యమి పథకం కింద పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటైన ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు పలు ప్రభుత్వ, వైద్య, డిజిటల్ సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, వైద్య పరీక్షల కేంద్రం, జన ఔషధి కేంద్రం, తంతు ఆధారిత ఇంటర్నెట్ సేవలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వైఫై సౌకర్యం, రైతులకు డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షలు తదితర సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఉపాధి కోసం యువత నగరాలకు, విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితులను తగ్గించేందుకు గ్రామాల్లోనే ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఆధార్ నవీకరణలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఫోన్ రీచార్జీలు, తపాలా సేవలు వంటి అనేక సేవలు ఈ కేంద్రం ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. వైద్య పరీక్షల కేంద్రంలో 60 రకాల పరీక్షలు తక్కువ ఖర్చుతో నిర్వహించే అవకాశం కల్పించామని, జన ఔషధి కేంద్రంలో మందులు మార్కెట్ ధరల కంటే తక్కువకు లభిస్తాయని చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు భూసార పరీక్షలు, డ్రోన్ల ద్వారా పిచికారీ సేవలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ యువత, విద్యార్థులు, మహిళలు, రైతులకు ఉపయోగపడే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు కావడం ఆనందదాయకమన్నారు. గ్రామాల్లో వేగవంతమైన ఇంటర్నెట్, వైఫై సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని చెప్పారు.

## బొల్లా బ్రహ్మనాయుడు పెద్ద భూబకాసురుడు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ




వినుకొండ (చైతన్యరథం): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గంలో పేదలు, దళితులు, ముస్లింల భూములను అడ్డగోలుగా ఆక్రమించుకున్న పెద్ద భూబకాసురుడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వినుకొండ మండలం ఏనుగుపాలెంలో శనివారం జరిగిన 'మీ భూమి – మీ హక్కు' పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బ్రహ్మనాయుడు చేసిన భూదందాలు, మోసాలు అన్నీ ఇన్నీ కావని, బాధితులంతా ఆధారాలతో సహా వచ్చి తనను కలుస్తున్నారని తెలిపారు. బ్రహ్మనాయుడు ఆక్రమణలపై, లూటీలపై పూర్తిస్థాయిలో 'సిట్' (SIT) వేయించి, విచారణ జరిపించి సాక్ష్యాధారాలతో సహా కోర్టు ముందు నిలబెట్టి కఠిన శిక్ష పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. హైదరాబాద్ గండిపేట పరిధిలో దాదాపు రూ.1500 కోట్ల విలువైన 9 ఎకరాల 28 సెంట్ల ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు బొల్లా బ్రహ్మనాయుడు, ఈపూర్ మండలం అంగలూరుకు చెందిన ఆయన బంధువు బొల్లా రమేష్ కలిసి భారీ స్కెచ్ వేశారని జీవి ఆంజనేయులు ఆరోపించారు. వీరిద్దరూ తోడుదొంగలుగా మారి, ఏకంగా రూ.8 కోట్ల లంచాలు ఇచ్చి నకిలీ జీవోలు, దొంగ స్టాంపులు, ఐఏఎస్ అధికారుల నకిలీ సంతకాలను సృష్టించారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడంతో తమ ఆటలు సాగవని భయపడి బ్రహ్మనాయుడు పక్క రాష్ట్రానికి పారిపోయాడని ఎద్దేవా చేశారు. ఈ నకిలీ పత్రాల వ్యవహారాన్ని తెలంగాణ పోలీస్, రెవెన్యూ అధికారులు గుర్తించి కేసు నమోదు చేయడంతో, కంచి (కాంచీపురం)లో దాక్కున్న బ్రహ్మనాయుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారని గుర్తుచేశారు. ఈ దుర్మార్గుల వల్ల వినుకొండ ప్రతిష్ట దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వినుకొండలో ఏ ఎమ్మెల్యే కూడా చేయని విధంగా పేదల భూములను బ్రహ్మనాయుడు ఆక్రమించుకున్నాడని ఆంజనేయులు విమర్శించారు. 50 ఏళ్ల క్రితం ఒక దళితుడు కొనుక్కున్న రెండెకరాల భూమిని ఆక్రమించుకొని, దానికి ఆనుకుని ఉన్న మరో రెండెకరాలతో కలిపి మొత్తం నాలుగు ఎకరాలకు ఫెన్సింగ్ వేసుకున్నాడని ధ్వజమెత్తారు.

## ప్రపంచవ్యాప్తంగా టీడీపీ కుటుంబాన్ని ఏకం చేస్తున్న మహాశక్తి టీడీపీ

●జర్మనీలో మినీ మహానాడుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేవలం రాజకీయ పార్టీ కాదని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తెలుగువారిని ఒకే కుటుంబంగా కలిపిన మహా ఉద్యమమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం జర్మనీ దేశంలో నిర్వహించిన తెలుగుదేశంపార్టీ మినీ మహానాడుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నందమూరి రామకృష్ణ, గళ్ళా రామచంద్రరావు, మన్నవ సుబ్బారావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... జర్మనీ వంటి విదేశీ గడ్డపై వందలాది మంది తెలుగువారు ఒకే వేదికపై చేరి మహానాడు నిర్వహించడం సాధారణ విషయం కాదని, దీనికి కారణం పార్టీ వ్యవస్థపై ఉన్న విశ్వాసం, ఎన్టీఆర్ చూపిన ఆత్మగౌరవ భావజాలమేనని, విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు కూడా పార్టీ సిద్ధాంతాలను, తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటుతున్నారని కొనియాడారు. పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు కేవలం తొమ్మిది నెలల్లో పార్టీని స్థాపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అవతరించడం భారత రాజకీయ చరిత్రలో అపూర్వ ఘట్టమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఒక నాయకుడు మాత్రమే కాకుండా, తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని అందించిన యుగపురుషుడని కొనియాడారు. అదే స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తూ నారా చంద్రబాబు నాయుడు తెలుగువారిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేశారని, ముఖ్యంగా ఐటీ రంగ అభివృద్ధి ద్వారా లక్షలాది మంది యువతకు ప్రపంచ ద్వారాలు తెరిచారని తెలిపారు. నేడు ప్రపంచంలోని ప్రతి మూలలో తెలుగువారు ఉండటానికి చంద్రబాబు దూరదృష్టి కూడా ప్రధాన కారణమని అన్నారు. అలాగే నారా లోకేష్ యువతతో మమేకమవుతూ పార్టీ భావజాలాన్ని తదుపరి తరాలకు చేరవేస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వ్యక్తుల సమూహం కాదని, విలువలు, క్రమశిక్షణ, త్యాగాలతో నిర్మితమైన ఒక బలమైన వ్యవస్థ అని వివరించారు.

# సీఎం చంద్రబాబు విజన్‌తో ముందడుగు

**పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడి**



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ప్రజారోగ్య పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు.. దొంతాళి డంపింగ్ యార్డ్‌లోని ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను శనివారం స్వయంగా పర్యవేక్షించిన ఆయన, పనులు శరవేగంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడారు.దొంతాళిలో ఉన్న లక్ష టన్నుల చెత్తను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా తొలగిస్తామని, అక్కడ జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చి.. ప్లాంట్‌కు 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెత్తను ఏరోజుకారోజు బర్న్ చేస్తామని ప్రకటించారు.గత ప్రభుత్వం అవగాహన, విజన్ లేక చెత్త పరిపాలన చేసిందని, ప్రజలపై చెత్తపన్ను వేయడమే కాకుండా రాష్ట్రంపై 153 లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని విమర్శించారు. 2014లో తాము శాంక్షన్ చేసిన ప్లాంట్లను గత పాలకులు రద్దు చేశారని,అవి పూర్తయి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రోజుకు వచ్చే 7 వేల టన్నుల చెత్త ఆ రోజే బర్న్ అయిపోయేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 130 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన 23 లక్షల టన్నుల చెత్తను జూలై ఆఖరుకల్లా ప్రాసెస్ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖల్లోని ప్లాంట్ల ద్వారా రోజుకు 2,800 టన్నుల చెత్తతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, తమ ప్రభుత్వం వచ్చాక మరో 6 వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం అనుమతిచ్చారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం రూ.300 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, జూలై నెలాఖరు నాటికి ఏపీలోని 107 ప్రాసెసింగ్ ప్లాంట్లను ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,ఎస్ ఈ జానీ,జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ,జిగ్మా కంపెనీ ప్రతినిధులు, నారాయణ విద్యాసమస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం 47 వ డివిజన్ లో జరుగుతున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.పార్టీ శ్రేణులు,బిఎల్ఏ,బిఎల్ఓ లతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.ఓటర్ల జాబితా సవరణ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.



# హైబ్రిడ్ మహానాడు విజయోత్సవం

కోవూరు (చైతన్యరథం): ఇటీవల నిర్వహించిన 'హైబ్రిడ్ మహానాడు' కార్యక్రమ సమయంలో తాను నియోజకవర్గంలో లేకపోయినప్పటికీ, 11 క్లస్టర్లలోని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో పసుపు పండుగలా భావించి, భుజస్కంధాలపై వేసుకుని విజయవంతం చేశారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అభినందించారు. కార్యకర్తల ఉత్సాహం కారణంగానే హైబ్రిడ్ మహానాడు నిర్వహణలో కోవూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆమె గర్వంగా ప్రకటించారు. ఈసారి మహానాడులో 'స్త్రీ శక్తి' థీమ్‌కు ప్రాధాన్యత ఇచ్చి, మహిళలకు 33% రిజర్వేషన్ ప్రకటించారని, రాబోయే రోజుల్లో టీడీపీలో ఎంతోమంది మహిళలు నాయకులుగా ఎదగబోతున్నారని తెలిపారు.

# సీఎం చంద్రబాబు స్ఫూర్తితో...

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సైకిల్ పర్యటన

దర్శి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్ఫూర్తిగా తీసుకొని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి పట్టణంలోని 6వ వార్డు పర్యటనకు సైకిల్ పై పర్యటించారు. ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో సంక్షేమ అభివృద్ధి ప్రతి ఇంటికి చేర్చాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్ళామని ఇంకా మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో పనిచేయాల్సిన అవసరం ఉందని లక్ష్మి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. ప్రజలు కూడా మన మంచి ప్రభుత్వాన్ని ఆదరించాలని, అభిమానించాలని, దీవించాలని కోరారు. రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించాలని పిలుపునిచ్చారు.





# టీడీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన



మదనపల్లె (చైతన్యరథం): పట్టణంలో తెలుగుదేశం పార్టీ నూతన పార్లమెంట్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రాష్ట్ర పార్టీ ప్రముఖులు, వాస్తు నిపుణుల బృందంతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. పార్టీ కార్యకర్తలకు మరింత సౌకర్యవంతంగా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా కార్యాలయ నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో ఈ పర్యటన చేపట్టారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా, పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దూరదృష్టి, అభివృద్ధి ఆలోచనలు, యువనేత నారా లోకేష్ చైతన్యవంతమైన నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణాచారి, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్ , ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

**కార్యకర్తలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు**



కోవూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమని, ప్రతి ఓటూ విజయానికి ప్రాతిపదిక అని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. సర్ యోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 324 బూతులు ఉన్నాయని చెప్పారు. ఇందుకూరుపేట మండలంలో మొత్తం 48,741 ఓట్లు ఉండగా, ఇప్పటివరకు 19,008 ఓట్ల మ్యాపింగ్ మాత్రమే పూర్తయిందని చెప్పారు. జూన్ 14 నుంచి బూత్ లెవెల్ ఏజెంట్లు, యూనిట్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు సమన్వయంతో ఇంటింటికీ తిరిగి 100 శాతం ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. దొంగ ఓట్లను గుర్తించి వెంటనే తొలగించాలని, మరణించిన వారి ఓట్లను తొలగించి, కొత్తగా వచ్చే యువత ఓట్లను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. దొంగ ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐ టీడీపీ సభ్యులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ, ప్రతి ఒక్కరూ 'మై టీడీపీ' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లేటప్పుడు కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని వివరించాలని కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఒక మొక్కను నాటాలని ఎమ్మెల్యే కోరారు. కాలుష్య రహిత వాతావరణం కోసం వీలైనంత వరకు సైకిల్ ప్రయాణాలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలానే అందరూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, భూగర్భజలాల పెంపుకు సహకరించాలని సూచించారు. అందరూ పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆమె ప్రజలకు, అధికారులకు, కార్యకర్తలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ముఖ్య నేతలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, ఐటీడీపీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 24 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు తెచ్చి, 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని అన్నారు. అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి 16,000 టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. జిల్లాలో రూ. లక్ష కోట్లతో దీూజూ కంపెనీ, ఇఫ్కో కిసాన్‌లో రూ.13,000 కోట్లతో పరిశ్రమలు రాబోతున్నాయని అన్నారు. సాగు కాలువలను బాగు చేసి సాగునీరు అందించామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల జీవనభృతిని రూ.20,000కి పెంచామని, ఆక్వా రైతులకు తక్కువ ధరకే విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పట్ల అప్రమత్తంగా ఉండండి

## తెలుగుదేశం పార్టీ శ్రేణులకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ సూచన



రాయదుర్గం (చైతన్యరథం): ఓటర్ల సవరణ జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తప్పక ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఓటర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం ఏమరుపాటు పనికిరాదని హెచ్చరించారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ యూనిట్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇంచార్జిలు, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2026" కార్యక్రమంపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీ నుండి జూలై 14 వ తేదీ వరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లను సవరణ జాబితాలో (హౌస్ మ్యాపింగ్) పొందుపరుస్తారని వివరించారు. సర్వే అధికారులు ఇంటింటికి వెళ్లినప్పుడు స్థానిక బూత్ లెవెల్ ఏజెంట్లు, యూనిట్ఇన్చార్జిలు వారితో కలిసి వెళ్లాలన్నారు. ఆయా ఇండ్లలో అర్హులైన ఓటర్ల వివరాలను వారికి అందజేసేలా చూడాలన్నారు. ఇందులో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా... ప్రత్యర్థి పార్టీలు మన ఓట్లను గల్లంతచేసి కుట్రలకు పాల్పడే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. ముఖ్యంగా కూటమి పార్టీలకు చెందిన, పార్టీ మద్దతుదార్ల, తటస్థదార్ల ఓటర్లను సవరణ జాబితాలో తప్పించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పుడు నిద్రపోతే ఎన్నికల్లో నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. ఈలోగా ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండేలా బాధ్యతగా పని చేయాలన్నారు. 18 సంవత్సరాలు పైపడ్డ వారందరి పేర్లను ఓటరు జాబితాలో తప్పక చేర్పించాల్సి ఉందన్నారు. అలాగే చనిపోయిన, పెళ్లిళ్లు చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన, లేదా శాశ్వత వలసదారులను గుర్తించి వారి పేర్లను జాబితా నుండి తొలగించేలా చూడాలన్నారు. వైసిపి పార్టీ వారు రెండు, మూడు చోట్ల తమ పేరు నమోదు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. ఎక్కడైనా అలా ఉంటే..! వెంటనే గుర్తించి సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి ఓటర్ల జాబితా నుండి తొలగింప చేయాలన్నారు. రాబోయే నెల రోజులు మనకు పరీక్ష సమయమని, ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు కురుబ హనుమంతు, కాలవ సన్నన్న, వన్నారెడ్డి, కురుబ మల్లెన్న,క్లస్టర్ ఇంఛార్జీలు తలారి గంగాధర్, గోవింద్, హరిజన ఆనంద్, మారుతీ, పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, వాల్మీకి సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఆశయ సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## హోమ్ మంత్రి వంగలపూడి అనిత వెల్లడి



దర్శి (చైతన్యరథం): పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రెండేళ్లుగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. దర్శి ప్రాంతంలో కూడా ఈ రెండేళ్లలో శాంతిభద్రతలు ప్రజల స్వేచ్ఛ జీవితం తెలుస్తుందన్నారు.ౖ ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి చేస్తున్న అభివృద్ధి కృషిని ఆమె అభినందించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి అభిమానించాలని కోరారు. లి త్వరలో దర్శి లో ఐతీ. గొట్టిపాటి లక్ష్మి గారి తో కలిసి పర్యటిస్తానని తెలియజేసారు. గత ఐదేళ్లు రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు గురి చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమం లో దర్శి నియోజకవర్గం లోని మండల పార్టీ అధ్యక్షులు, మహిళలు, వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్‌లో సర్‌పై సమీక్ష

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పున:పరిశీలన పై తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, తెలుగుదేశం పార్టీ నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చేపట్టవలసిన కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. ఓటరు జాబితాల రివిజన్ ప్రక్రియ 24 ఏళ్ల తర్వాత ఎలక్షన్ కమిషన్ చేపట్టిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సర్ కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. జూన్ 15 నుంచి జూలై 14వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలు సేకరిస్తారు. జూలై 14న పోలింగ్ స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ చేపడుతారు. జూలై 21వ తేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురిస్తారని తెలిపారు.

# అప్రమత్తంగా ఉండండి, ప్రతి ఓటు కీలకమే

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంలో స్తానిక టీడీపీ నేతలు కృషి చేయాలన్నారు.. సిటీ నియోజకవర్గంలోని ఆయన అడాప్ట్ తీసుకున్న 16వ డివిజన్ లోని 242 బూత్ లో పర్యటించారు.. ఓటర్ వెరిఫికేషన్ లో నేరుగా పాల్గొన్నారు. ూ×= ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలు మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా తయారవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఓటు కీలకమేనని.. తప్పులు లేని ఓటర్ల జాబితాకు దీూా లు కృషి చేయాలన్నారు.. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షుడు పెనుబర్తి సాయిరాం, కస్టర్ ఇంచార్జి యస్వంత్ రెడ్డి, బూత్ కన్వినర్, సతీష్ యూనిట్ ఇంచార్జి రెడ్డి హనీఫ్, జనరల్ సెక్రటరీ హరి, పాల్గొన్నారు.





కనిగిరి పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, ఏపీ హెూం మినిస్టర్ వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు ముక్కు ఉగ్రనరసింహ రెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్ కుమార్, గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గ్రంథాలయం చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య స్థానిక నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



నందికొట్కూరు మండలం బ్రాహ్మణకోట్కూర్ గ్రామంలో రైతన్నలకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య "మీ భూమి మీ హక్కు" కూటమి నాయకులతో కలిసి రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను స్వయంగా రైతులకు అందజేశారు

## 'నాట్స్' నూతన అధ్యక్షుడిగా

# రాజ్ అల్లాడ

### 2026-28కి నూతన కార్యవర్గం ప్రకటన



**న్యూజెర్సీ:** ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (NATS) 2026-28 కాలానికి నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించింది. నాట్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సుదీర్ఘంగా చర్చించి అనుభవం, నిబద్ధత ఆధారంగా ఈ సరికొత్త సేవా బృందాన్ని ఎంపిక చేసింది. సంస్థను మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు, సేవా కార్యక్రమాలను గ్లోబల్ స్థాయికి విస్తరించేందుకు నూతన అధ్యక్షుడిగా న్యూజెర్సీకి చెందిన ప్రముఖ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ రాజ్ అల్లాడ (Raj Allada) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నాట్స్ నూతన కార్యవర్గ ప్రతినిధులు:** అధ్యక్షుడిగా రాజ్ అల్లాడ బాధ్యతలు చేపట్టగా వైస్ ప్రెసిడెంట్ (ప్రోగ్రామ్స్)గా రాజేష్ కంద్రు, వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్ & మార్కెటింగ్)గా అనుదీప్ అర్లా, వైస్ ప్రెసిడెంట్ (సర్వీసెస్)గా రాజ్యలక్ష్మి చిలుకూరి నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సుధీర్ మిక్కిలినేని, కోశాధికారిగా రామ్‌నరేష్ కొమ్మన బోయిన, జాయింట్ సెక్రటరీగా భాను లంక, జాయింట్ ట్రెజరర్‌గా వెంకట్ సాకమూరి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నూతన బృందమంతా వారివారి రంగాల్లో విశేష అనుభవంతో పాటు నాట్స్ సంస్థ పట్ల పూర్తి అంకితభావం తో పనిచేస్తూ ముందుకు సాగనుంది.

**వాలంటీర్ నుంచి అధ్యక్షుడి వరకు...**

**రాజ్ అల్లాడ ప్రస్థానం:** నూతన అధ్యక్షుడు రాజ్ అల్లాడ గత రెండు దశాబ్దాలుగా అమెరికాలోని తెలుగు కమ్యూనిటీకి సుపరిచితులు. ఆయన 2009లో నాట్స్‌లో ఒక సాధారణ వాలంటీర్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించి సంస్థలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఎదిగారు. గతంలో పలుమార్లు నాట్స్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించి సంస్థ అభివృద్ధికి అనేక వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా 2023లో న్యూజెర్సీలో అత్యంత వైభవంగా జరిగిన నాట్స్ జాతీయ సంబరాలకు డిప్యూటీ కన్వీనర్‌గా వ్యవహరించి నిధుల సేకరణలో, వాలంటీర్లను ఒకే తాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఆ వేడుకలను విజయవంతం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఈ సందర్భంగా నూతన కమిటీకి నాట్స్ బోర్డు చైర్మన్ కిషోర్ కంచర్ల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. "రాజ్ అల్లాడ నాయకత్వంలోని ఈ నూతన బృందానికి స్పష్టమైన లక్ష్యాలు, అద్భుతమైన సేవా దృక్పథం ఉన్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో ఈ కమిటీ నాట్స్ విలువలను మరింత ముందుకు తీసుకెళ్తుందని, సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచుతూ సరికొత్త సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని నేను బలంగా నమ్ముతున్నాను."

రాజ్ అల్లాడ నేతృత్వంలోని నూతన కార్యవర్గం విజయవంతంగా పనిచేసి సంస్థకు మరిన్ని విజయాలు, మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ నాట్స్ బోర్డ్ శుభాకాంక్షలు తెలియజేసింది. నూతన కార్యవర్గ నియామకం పట్ల అమెరికా, తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ప్రముఖులు, కమ్యూనిటీ లీడర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## ప్రవాస భారతీయులకు టీటీడీ శుభవార్త

### సుపథం మార్గంలో శ్రీవారి దర్శనానికి గడువు పరిమితి పెంపు

**తిరుపతి (చైతన్యరథం):** ప్రవాస భారతీయులు (NRIs) సుపథం మార్గంలో శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రస్తుతం ఉన్న గడువు పరిమితిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 30 రోజుల నుంచి 90 రోజులకు పెంచింది. ఇప్పటివరకు ప్రవాస భారతీయులు శ్రీవారిని దర్శించుకునేం దుకు వారు స్వదేశానికి వచ్చిన 30 రోజుల్లో ఒరిజినల్ పాస్‌పోర్ట్ (Original passport), ఒక సెట్ జిరాక్స్ కాపీ



తీసుకుని సుపథం (Supatham) మార్గం వద్దకు చేరుకుంటే పాస్‌పోర్ట్ పరిశీలించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెన్ జారీ చేస్తున్నారు. అయితే కొందరు ప్రవాస భారతీయులకు 30 రోజుల కాలపరిమితి ఇబ్బందిగా మారింది. దీనిపై గడువు పెంచాలని టీటీడీకి విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో స్పందించిన టీటీడీ 90 రోజులకు గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.



# జర్మనీలో పసుప్పు పండుగ

### ఘనంగా మినీ మహానాడు, ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

**ముఖ్య అతిథులుగా గల్లా మాధవి, నందమూరి రామకృష్ణ, మన్నవ సుబ్బారావు, గల్లా రామచంద్రరావు హాజరు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రం 20 ఏళ్లు ముందుకెళ్లిందన్న నేతలు**

**ఐర్లాండ్, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ నుంచి భారీగా తరలివచ్చిన ప్రవాసాంధ్రులు**





**జర్మనీ:** జర్మనీలో మినీ మహానాడు, ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, గల్లా రామచంద్రరావు హాజరయ్యారు. ఎన్‌ఆర్‌ఐ టీడీపీ జర్మనీ విభాగానికి సంబంధించి వెబ్‌సైట్‌ను మాధవి ఆవిష్కరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్ల కేటాయించాలని టీడీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని వక్తలు కొనియాడారు. అవినీతి, అరాచకం, విధ్వంసాలతో ఏపీలో సాగిన జగన్ పాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో పోటుపొడిచారని... చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని స్పష్టం చేశారు. సుపరిపాలన ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జ్యోతి ప్రజ్వలన, మా తెలుగు తల్లికి గీతాలాపనలతో కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. జై టీడీపీ, ఎన్టీఆర్ అమర్ రహే... జై చంద్రబాబు... జై లోకేష్.. నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ... ఎల్లలు దాటినా మాతృభూమిని, తెలుగుదేశం పార్టీని ప్రవాసాలు గుర్తుపెట్టుకోవడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. జర్మనీలో మహానాడు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ కుమారుడిగా జన్మించడం తన అదృష్టమని తెలిపారు. ఆయన కుటుంబం కంటే ప్రజలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వారిని గుర్తు చేశారు. 'తెలుగు నేలపై చెరగని చిరునామా ఎన్టీఆర్. సినిమాల్లో నటించినా, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చినా... ఏది చేసినా ప్రజాహితం... సంచలనమే. సంక్షేమ రాజ్యాన్ని స్థాపించి, సామాజిక న్యాయాన్ని చిత్తశుద్ధితో అమలుచేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది" అన్నారు.

కూటమి ప్రభుత్వ 24 నెలల పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో 20 ఏళ్ల ముందుకెళ్లిందని మన్నవ సుబ్బారావు అన్నారు. జూన్2 నిరంకుశత్వానికి చరమగీతం పాడి...ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన రోజని వెల్లడించారు. గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ.... ప్రవాసాంధ్రులు ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టాలని, అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకోవాలి అని పిలుపునిచ్చారు. జర్మనీ నుంచే కాక ఐర్లాండ్, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్‌ల నుంచి ప్రవాసాంధ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మిని మహానాడులో 46 రకాల ఆంధ్ర వంటకాలతో అతిథులకు కమ్మని విందు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమానికి రామ్ బొల్లా సహాయ సహకారాలు అందజేశారు. మహానాడు కో-ఆర్డినేటర్ వంశీ దాసరి, ఎన్నారై టీడీపీ నాయకులు వెంకట్ ఖంద్ర, శ్రీకాంత్ కుడితిపూడి, పవన్ కుర్ర, సుమంత్ కొర్రపాటి, నరేష్ కోనేరు, శివ బత్తుల, టిట్టు మద్దిబట్ల, కిషోర్ చలసాని, రావి అమర్‌నాథ్ సహా పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# జమ్మూ కశ్మీర్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే

## ఐక్యరాజ్యసమితి వేదికగా పాక్‌కు స్ట్రాంగ్ కౌంటర్




ఐక్యరాజ్యసమితి వేదికగా జమ్మూ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి సమాధానం ఇచ్చింది. పాకిస్థాన్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమైనవని, తప్పుడు కథనాలను ప్రచారం చేసే ప్రయత్నమని భారత ప్రతినిధి మండలి పేర్కొంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా పాక్‌కు భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ కౌంటర్ ఇచ్చారు. 'జమ్మూ కశ్మీర్ గతంలోనూ, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ భారతదేశంలో అంతర్భాగంగానే ఉంటుంది. పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలను తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోంది. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన అన్ని విషయాలు పూర్తిగా భారతదేశ అంతర్గత విషయాలు. పాకిస్థాన్ డొల్ల మాటలు, వాదనలు ఈ ప్రాథమిక వాస్తవాన్ని మార్చలేవు' అని హరీష్ పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్, కశ్మీర్‌ను 'అంతర్జాతీయంగా గుర్తించిన వివాదాస్పద ప్రాంతం'గా పేర్కొంది కాగా, గిల్గిట్ బల్టిస్తాన్ ప్రాంతానికి జూన్ 7న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలన్న పాకిస్థాన్ ప్రణాళికలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతం చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమణకు గురైన భారత భూభాగమని పేర్కొంది. గిల్గిట్ బల్టిస్తాన్ అనేది లడఖ్‌లో భాగమని, ప్రస్తుతం అది పాకిస్థాన్ ఆక్రమణలో ఉందని భారత్ చెబుతోంది. అందుకే అక్కడ ఎన్నికలు నిర్వహించడాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది.



# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఎనిమిది మంది మృతి, పదిహేను మందికి పైగా గాయాలు

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమీ దేరాకు శనివారం ఉదయం ప్రయాణం మట్నదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు.

## వయనాడ్ జిల్లాలో 150 మంది విద్యార్థులకు అస్వస్థత

కేరళంలోని వయనాడ్ జిల్లాలో ఒక పాఠశాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొద్ది రోజులుగా జ్వరం, వాంతుల బారిన పడటంతో 38 మందిని సుల్తాన్ బత్తేరి తాలూక్ ఆసుపత్రిలో చేర్చారు. మార్ బాసిలియోస్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూలులో చదువుతున్న విద్యార్థుల్లో గత మూడు రోజులుగా జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని, వ్యాధికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వ్యాధి మరింత విస్తరించకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. కాగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో అధికారులు ముందస్తు చర్యగా పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించారు. దీనిపై జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు ఆందోళన చెందవద్దని, పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు. విద్యార్థుల్లో ఎక్కువ మంది చికిత్సకు స్పందిస్తున్నారని, పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. విద్యార్థుల శాంపిల్స్ సేకరించి లాబొరేటరీకి పంపినట్టు చెప్పారు. ఆహారం, తాగునీటి కారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకిందా, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనేది పరీక్షల్లో నిర్ధారణవుతుందని తెలిపారు. పంచాయతీ ప్రతినిధులు కూడా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని, ఆరోగ్యం బాగా క్షీణిస్తున్న లక్షణాలేవీ లేవని చెప్పారు.

# లాలూ దంపతులకు భద్రత కుదింపు

## కర్రలతో కార్యకర్తల కాపలా

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవికి కల్పిస్తున్న జడ్ ప్లస్ సెక్యూరిటీని ఉపసంహరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రత కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బందిని లాలూ, రబ్రీదేవి శనివారం వెనక్కి పంపించేశారు. లాలూ నివాసం ముందు ఆర్జేడీ కార్యకర్తలు కర్రలు పట్టుకుని కాపలా కాశారు. లాలూ కుమారుడు, బీహార్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ కూడా తన వై కేటగిరీ భద్రతను వెనక్కి పంపించారు. కాగా, భద్రతా ఏర్పాట్ల పునఃసమీక్షలో భాగంగా పలువురు విఐపీల సెక్యూరిటీ కేటగిరీల్లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. తమకు, తమ కుటుంబానికి హాని కలిగించాలనే దురుద్దేశంతోనే భద్రతను తొలగించే నిర్ణయం తీసుకున్నారని లాలూ కుమార్తె కుమార్తె రోహిణి ఆచార్య విమర్శించారు. 'బీహార్ తొలి మహిళా ముఖ్యమంత్రి, ఆమె కుటుంబం ఎలా వేధింపులకు గురవుతున్నారో యావత్ దేశం, బీహార్ ప్రజలు చూస్తున్నారు. కక్షపూరితంగా తీసుకునే ప్రతి చర్యకు బిహార్ ప్రజలు తగిన విధంగా సమాధానం ఇస్తారు' అని రోహిణి ఆచార్య సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు.

# సీఎం డీకే చొరవతో సమసిన వివాదం

కోరుకున్న శాఖను ఇవ్వలేదంటూ మంత్రి పదవికి సీనియర్ నేత రామలింగా రెడ్డి రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. అసంతృప్తి నేతతో చర్చలు జరిపారు. అనంతరం సమస్య పరిష్కారమైనట్టు మీడియాకు వెల్లడించారు. జయనగర్‌లోని ఒక ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం రాత్రి రామలింగారెడ్డితో డీకే చర్చలు జరిపారు. కాంగ్రెస్ సీనియర్ మంత్రులు, రెడ్డి సన్నిహితులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'ఇది కుటుంబ వ్యవహారం. కలిసి కూర్చుకుని మాట్లాడుకున్నాం. సమస్య సద్దుమణిగింది. ఆయన తనకున్న ఇబ్బంది ఏమిటో చెప్పారు. సమాచార లోపం వల్లే ఇలాంటివి ఒక్కోసారి జరుగుతుంటాయి. వాటిని మేము పరిష్కరించుకుంటాం. అంతా సజావుగానే ఉంది. మేము సీనియర్లందరికీ అవకాశాలు కల్పిస్తాం. అన్ని వ్యవహారాలు చక్కబెడతాం' అని డీకే తెలిపారు. 1980 నుంచి తామిద్దరం మంచి మిత్రులమనీ, ప్రస్తుతం తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ గతంలో తాము మంత్రులమని, కలిసి పనిచేశామని చెప్పారు.

బెంగళూరు అర్బన్ డవలప్‌మెంట్(జీబీఏ) శాఖకు బదులు జలవనరుల శాఖను తనకు కేటాయించడంపై రామలింగారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తన పదవికి శుక్రవారం రాజీనామా చేసారు. తనకు మాట ఇచ్చి తప్పారంటూ మీడియా ముందే ఆయన తన రాజీనామా పత్రంపై సంతకం చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు. తన సహచరుడి ద్వారా రాజీనామా పత్రాన్ని డీకేకు పంపారు. అయితే ముఖ్యమంత్రి ఆయన రాజీనామాను అంగీకరించలేదు. సిద్ధరామయ్య సన్నిహితుడిగా రామలింగారెడ్డిని చెబుతారు. రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటకలో సిద్ధరామయ్య పట్టు కొనసాగుతోందనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. రెడ్డి రాజీనామాను అంగీకరిస్తే మరికొంత మంది కూడా తమ డిమాండ్లతో ముందుకు రావచ్చని డీకే భావిస్తున్నారని, మంత్రి రాజీనామాను తిరస్కరించడం ద్వారా ఆదిలోనే అసంతృప్తులకు అడ్డుకట్టు వేయాలనే నిర్ణయం తీసుకున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు.



# అభ్యర్థుల ఆత్మహత్యలే అంతిమ లక్ష్యమేమో!

## జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలో కాక్రోచ్ జనతా పార్టీ నేతల ఆవేదన, 23న రామ్‌లీలా మైదాన్‌లో భారీ ప్రదర్శన యోచన

ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలి?' అని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డీలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదివి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. విద్యాశాఖను వాంగ్‌చుక్ చేపట్టాలి.. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది.

# హార్మూజ్ జలసంధి రగులుతోంది

## చర్చలు జరుగుతున్నా దాడులు ఆగడం లేదు - ఇరాన్ రాడార్ కేంద్రాలపై అమెరికా దాడి



ప్రపంచ చమురు వ్యాపారానికి జీవనాడి అయిన హార్మూజ్ జలసంధి మళ్లీ నెత్తురోడుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమలులో ఉన్నప్పటికీ, హార్మూజ్‌లో ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను అమెరికా కూల్చివేసి, టెహ్రాన్‌కు చెందిన గోరుఖ్, ఖేల్మ్ ద్వీపాల్లోని తీరప్రాంత రాడార్ కేంద్రాలపై ప్రతిదాడులు నిర్వహించింది. నౌకల రవాణాకు ముప్పుగా మారిన ఇరాన్ డ్రోన్లనుంచి రక్షించుకునేందుకే ఈ చర్యలు అవసరమయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది.

మార్చి 19నుంచి అమెరికా, హార్మూజ్‌లో ఇరాన్ నౌకలు, డ్రోన్లను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు నిర్వహిస్తోంది. ఆ తర్వాత ఏప్రిల్ 13నుంచి ఇరాన్ నౌకాయాన నిరోధకత విధించింది. ఏప్రిల్ 8న పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో రెండు వారాల కాల్పుల విరమణకు అమెరికా-ఇరాన్ అంగీకరించాయి. అయితే ఆ తర్వాత ఇస్లామాబాద్ చర్చలు విఫలమయ్యాయి. కాల్పుల విరమణ అమలులో ఉన్న సమయంలోనే అమెరికా సైన్యం హార్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి కేంద్రాలు, నౌకలపై 'స్వయంరక్షణ దాడులు' నిర్వహించింది. అమెరికా-ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షలపై వివాదాల కారణంగా చర్చలు ముందుకు సాగడం లేదు. అయినప్పటికీ అధ్యక్షుడు ట్రంప్ 'వచ్చే వారంలో' హార్మూజ్ తెరవడానికి ఒప్పందం అందుకోవడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. అయితే ఇజ్రాయెల్ లెబనాన్‌లో దాడులు ఆపడం లేదని చెప్పి ఇరాన్ చర్చలను తాత్కాలికంగా నిలిపివేసింది. హెజ్బొల్లా కాల్పుల విరమణకు అంగీకరించినా, ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో దాడులు కొనసాగిస్తానని నెతన్యాహు స్పష్టంచేశారు.

కువైట్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ తీవ్రంగా విరుచుకుపడింది. 97 బాలిస్టిక్ క్షిపణులు, 283 డ్రోన్లను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. విద్యుత్ కేంద్రాలు, జలశుద్ధి ప్లాంట్లపై కూడా దాడులు జరిగాయి; దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. బహ్రెయిన్‌లో కూడా సైరన్లు మోగడంతో బలగాలు అలర్ట్‌లోకి వచ్చాయి. రెండు దేశాల మధ్య ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. 60 రోజుల కాల్పుల విరమణ పొడగింపు, హార్మూజ్ పునఃప్రారంభం, అమెరికా నౌకాయాన నిరోధకత ఎత్తివేత, అణు అంశాలపై చర్చలు అజెండాలో ఉన్నాయి. అయినా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే అనిశ్చితి కొనసాగుతోంది.

# పెంటగాన్ అప్రమత్తం!

### ఇజ్రాయెల్‌నుంచి గూఢచర్య ముప్పు 'క్రిటికల్' స్థాయికి..



అత్యంత సన్నిహిత మిత్రదేశాల మధ్య నమ్మకం పోతోందా? ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాల్లో తీవ్రమైన చీలికలు వెలుగులోకి వస్తున్నాయి. యుద్ధ ముగింపు విషయంలో ట్రంప్ చర్చలకు మొగ్గు చూపుతుండగా, ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌లో దాడులు ఆపడం లేదు. ఈ విభేదాల నేపథ్యంలో ఓ పెద్ద విషయం వెలుగులోకి వచ్చింది. పెంటగాన్ ఇజ్రాయెల్‌పై కౌంటర్ ఇంటెలిజెన్స్ ముప్పుస్థాయిని 'క్రిటికల్'కు పెంచింది. ఇరాన్ యుద్ధంపై ట్రంప్ యంత్రాంగం అంతర్గత నిర్ణయాలు, చర్చలను తెలుసుకునేందుకు ఇజ్రాయెల్ ప్రత్యేకంగా ప్రయత్నిస్తోందని పెంటగాన్ అనుమానిస్తోంది. అమెరికా సీనియర్ అధికారులు ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా బర్నర్ ఫోన్లు, ప్రత్యేక కంప్యూటర్లు వాడటం, హోటల్ గదుల్లో మాట్లాడేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించడం మామూలుగా మారింది.


అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఏడు పేజీల పత్రంతో కూడిన అంతర్గత అంచనాను జారీ చేసింది. ఇజ్రాయెల్ ఇటీవలి గూఢచర్య ప్రయత్నాలు సాధారణ మిత్రదేశ చర్యలకు చాలా మించి ఉన్నాయని మాజీ అమెరికా అధికారులు అభిప్రాయపడ్డారు. అమెరికా, ఇజ్రాయెల్ దశాబ్దాలుగా నిఘా విభాగాలు కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఇరాన్ యుద్ధ విషయంలో ఇరు ప్రభుత్వాలు ఏకాభిప్రాయం లేని సున్నితమైన దశలో ఇలాంటి ఆరోపణలు రెండు దేశాల మధ్య నమ్మకాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నివేదికలను ఇజ్రాయెల్ ఎంబసీ పూర్తిగా తోసిపుచ్చింది. అమెరికా ప్రభుత్వ అధికారులపై ఇజ్రాయెల్ నిఘా నిర్వహించడం లేదని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్ నిఘా శత్రువులపై మాత్రమే లక్ష్యం పెడుతుందని, ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని చెప్పింది. వైట్‌హౌస్ అధికారి కూడా ఈ కథనాన్ని 'పూర్తిగా అబద్ధం' అని తోసిపుచ్చారు. పెంటగాన్ వ్యాఖ్యానించేందుకు నిరాకరించింది. ఈ వివాదం రెండు దేశాల సంబంధాల్లో కీలక మలుపు అవుతుందా అని నిపుణులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# భారత్‌పై ఆంక్షలు విధిస్తే బూమరాంగే'

## - పశ్చిమ దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ చురకలు

భారత్ ఏ ఒత్తిళ్లనూ లెక్కచేయదని, మోదీ నాయకత్వంలో ఎల్లప్పుడూ జాతీయ ప్రయోజనాలకే పట్టం కడుతుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ధైర్యంగా ప్రకటించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో శుక్రవారం మాట్లాడిన ఆయన, పశ్చిమదేశాలకు కుండ బద్దలుకొట్టి చురకలు అంటించారు. ఎస్‌యు-57 స్టెల్త్ ఫైటర్ జెట్, ఎస్-500 వైమానిక రక్షణ వ్యవస్థలు కొనుగోలు చేస్తే భారత్‌పై అమెరికా ఆంక్షలు విధిస్తుందేమోనని అడిగిన ప్రశ్నకు పుతిన్ బదులిచ్చారు. భారత్‌కు ఆంక్షల రూపంలో బెదిరింపులు విధించే ప్రయత్నాలు వారికే ఎదురుదెబ్బగా మారతాయని హెచ్చరించారు. "భారత్ సార్వభౌమ దేశం. తనకు ఉపయోగమైన ఉత్పత్తులను ఎంచుకునే స్వేచ్ఛ భారత్‌కు ఉంది. మనం భారత్‌కు ఇవ్వవద్దని ఎవరూ మాకు నిర్దేశించలేరు" అని స్పష్టంచేశారు.

రష్యా-భారత్ రక్షణ సహకారం ఏ రాజకీయ వాతావరణానికీ లోబడేది కాదని పుతిన్ పునరుద్ఘాటించారు. ఎస్‌యు-57 ప్రపంచంలో ప్రస్తుతం అత్యాధునికమైన విమానమని, దానిని భారత్‌కు సరఫరా చేసేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని చెప్పారు. గతంలో రష్యా-భారత్ సంయుక్తంగా ఎస్‌యు-57 అభివృద్ధి చేయాలని ప్రయత్నించినా, ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. అయినా సరఫరా ప్రతిపాదన ఇప్పటికీ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇదిలాఉంటే, అమెరికా-భారత్ మధ్య ట్రేడ్ డీల్ చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల నాలుగు రోజుల భారత పర్యటన చేశారు. హార్మూజ్ జలసంధి మూసివేత, రష్యా చమురుపై ఆంక్షల నేపథ్యంలో భారత్ తన చమురు, గ్యాస్ సరఫరా సంక్షోభ సమస్యలను రూబియో ముందు ప్రస్తావించింది. రష్యా చమురు కొనుగోళ్లు



ఆంక్షలకు ముందు రోజుకు 20,000 బ్యారెళ్ల నుంచి గరిష్ఠంగా 20 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఇది భారత్ శుద్ధి కర్మాగారాలకు 11 వేల కోట్ల నుంచి 25 వేల కోట్ల డాలర్ల మేర ఆదా అందించింది. రూబియో అమెరికా చమురు కొనుగోళ్లను పెంచాలని పిలుపునిచ్చారు. మొత్తంగా పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత్ ముందు శక్తి భద్రత అతిపెద్ద సవాలుగా మారింది.

# ఎడారిలో 49మంది దుర్మరణం

### ఈద్ పండుగకు వెళ్లి.. దాహంతో అసువులు బాసిన వైనం



నైజర్‌లో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఈద్-అల్-అజ్హా పండుగ జరుపుకొనేందుకు మాలికి వెళ్లిన నైజర్ పౌరులు తిరిగివస్తుండగా, వారి ట్రక్కు అల్జీరియాతో సరిహద్దు పట్టణం అసమాకాకు 80 కిలోమీటర్ల దూరంలో మారుమూల ఎడారిలో ఆగిపోయింది. నీళ్లు అయిపోవడంతో 49మంది దాహంతో ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్, ప్రయాణికులు ట్రక్కును బాగుచేసేందుకు ప్రయత్నించినా విఫలమయ్యారు. చివరకు ఇద్దరు వ్యక్తులు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి, అసమాకా పట్టణానికి చేరుకుని అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా, ట్రక్కు కింద, చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కనిపించాయి. 49మంది మృతదేహాలను అక్కడే సామూహిక సమాధుల్లో ఖననం చేశారు. యూరప్‌కు వలస వెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారు. గతంలోనూ అనేకమంది ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు.

# లక్ష బొద్దింకలు సీజ్!

### ఆస్ట్రేలియా చరిత్రలో పెద్ద రికార్డు



ఆస్ట్రేలియా అధికారులు న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రంలోని బాతర్స్ నగరంలో ఒక వ్యాపారివద్ద లక్షకుపైగా అక్రమ విదేశీ బొద్దింకలను స్వాధీనం చేసుకున్నారు. మడగాస్కర్ హిస్సింగ్, దుబియా జాతుల ఈ బొద్దింకల అంచనా విలువ రెండు లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు. ఆస్ట్రేలియాలో ఈ జాతులను దిగుమతి చేసుకోవడం, పెంచడం, విక్రయించడం చట్టవిరుద్ధం. మడగాస్కర్ హిస్సింగ్ బొద్దింక ప్రపంచంలోనే అతిపెద్ద జాతుల్లో ఒకటి. సిడ్నీకి 200 కిలోమీటర్ల దూరంలోని బాతర్స్‌లో దాడి జరిగింది. ఇవి ఎక్కువగా పెంపుడు సరీసృపాలకు ఆహారంగా అక్రమంగా విక్రయించేవారని అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుంచి న్యూ సౌత్ వేల్స్‌లో 27 తపాలా పార్సెల్స్‌లో జీవ కీటకాలు సీజ్ చేయడం, ఫిబ్రవరి 2026లో ఒక సిడ్నీ వ్యక్తికి ఆస్ట్రేలియన్ సరీసృపాలు ఎగుమతి చేయడానికి యత్నించినందుకు 8 సంవత్సరాల జైలు శిక్ష పడటంతో అధికారులు జీవ వైవిధ్య రక్షణలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు.

### హెచ్-1బీపై పోరాటం ముందుకు
### -భారతీయులు టార్గెట్ కాదు




టెక్సాస్ రిపబ్లికన్ కాంగ్రెస్‌మెన్ చిప్ రాయ్ జూన్ 4న 'అమెరికన్ వైట్-కాలర్ వర్కర్ జాబ్స్ యాక్ట్ 2026'ను ప్రవేశపెట్టారు. హెచ్-1బీ లాటరీ విధానాన్ని తొలగించి వేతన ఆధారిత ఎంపికను తీసుకురావాలని, ఇటీవల కాంట్రాక్టు తగ్గించిన సంస్థలు హెచ్-1బీ వర్కర్లను నియమించుకోకుండా నిరోధించాలని, హెచ్-1బీ ద్వారా గ్రీన్‌కార్డు మార్గాన్ని మూసివేయాలని ఇందులో కోరారు. అమెరికాలో టెక్ కంపెనీలు 2026 ఒక్క సంవత్సరంలోనే లక్షా 23 వేలమందిని తొలగించాయని, అయినా హెచ్-1బీ నియామకాలు కొనసాగుతున్నాయని బిల్లు సమర్థకులు వాదిస్తున్నారు. అయితే, రిపబ్లికన్లు హౌస్‌లో 217 సీట్లతో స్వల్ప మెజారిటీ కలిగి ఉన్నందున ఈ బిల్లు ఆమోదం పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులు తమ లక్ష్యం కాదని అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## భారత్ వర్సెస్ అఫ్గాన్ టెస్టు..

# తొలిరోజు టీమిండియా పరుగుల వరద




మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియం (పంజాబ్) వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజున టీమిండియా పరుగుల వరద పారించింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 368 పరుగులు రాబట్టింది. శుభ్‌మన్ గిల్ (103), కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ (81) పరుగుల పారించడంతో ఆట ముగిసే సమయా నికి భారత్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. క్రీజ్‌లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ (50) ఉన్నారు. టాస్ గెలవడంతో టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లుగా యశశ్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్ బరిలోకి దిగారు. జైస్వాల్ ఐదు బౌండరీలతో తొలి నుంచీ దూకుడుగా ఆడాడు. రాహుల్ మాత్రం ఆచితూచి పరుగులు రాబట్టాడు. అయితే, ముహమ్మద్ సలీమ్ బౌలింగ్‌లో 11వ ఓవర్‌లో జైశ్వాల్ (24) ఔటవడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం బరిలోకి దిగిన సాయి సుదర్శన్, కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇద్దరూ స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ క్రమం తప్పకుండా పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 139 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే, సెంచరీకి కొద్ది దూరంలో ఉండగా సాయి సుదర్శన్ (81) వికెట్ చేజార్చుకున్నాడు. సలీమ్ బౌలింగ్‌లో కీపర్‌కు చిక్కి వెనుదిరిగా డు. ఆ తరువాత క్రీజ్‌లోకి వచ్చిన శుభ్‌మన్ గిల్ భారత్ ఇన్నింగ్స్ కు స్థిరత్వాన్ని ఇచ్చాడు. అద్భుతమైన షాట్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే, కేఎల్ రాహుల్ సెంచరీ పూర్తి చేసుకున్న మరుక్షణమే ఔటయ్యాడు. జియౌర్ రెహ్మాన్ షరీఫీ బౌలింగ్‌లో రాహుల్ ఎక్స్‌ట్రా కవర్ వద్ద దొరికిపోయాడు. అనంతరం రిషభ్ పంత్, గిల్ కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ఈ క్రమంలో గిల్ తన కెరీర్‌లో 11వ శతకం పూర్తి చేసుకున్నాడు. పంత్ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు.



### కెప్టెన్సీ కోల్పోయిన సూర్యకుమార్ ఫస్ట్ రియాక్షన్

*భారత టీ20 జట్టుకు గొప్ప సారథిగా ఎన్నో విజయా లందించిన సూర్యకుమార్ యాదవ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత టీ20 జట్టులో అతడికి మొండి చేయి చూపింది బీసీసీఐ. కెప్టెన్సీ బాధ్యతలను కూడా శ్రేయస్ అయ్యర్‌కు అప్పగిస్తూ సూర్యకుమార్‌కు ఉద్వాసన పలికింది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ తొలిసారిగా స్పందించాడు. జట్టు ఎంపిక అనంతరం తన ఇన్‌స్టా స్టోరీలో టీమ్‌ఇండియా వివరాల ను పంచుకున్న స్కై.. 'ఈ ప్రతిభావంతమైన జట్టుకు రాబోయే సవాళ్లలో విజయాలు కలగాలి' అని శుభాకాంక్షలు తెలియజేశా డు. తనకు ఎదురైన నిరాశను పక్కనబెట్టి జట్టుకు మద్దతు తెలపడం అభిమానుల ప్రశంసలందుకుంటోంది. సూర్యకుమార్ నాయకత్వంలో భారత జట్టు అద్భుత విజయాలు సాధించింది. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో తొలిసారి పగ్గాలు అందుకున్న అతడు.. రోహిత్ శర్మ రిటైర్మెంట్ అనంతరం పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టాడు. అతడి సారథ్యంలో భారత్ 52 మ్యాచ్‌లు ఆడి 42 విజయాలు సాధించింది. 2025 ఆసియా కప్ సహా ఈ ఏడాది స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచ కప్‌నూ గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అయితే కెప్టెన్‌గా విజయవంతమైన సూర్య.. రెండేళ్లుగా బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోతున్నాడు. ఇటీవల ఐపీఎల్‌లో నూ అతడి ప్రదర్శన నిరాశాజనకంగానే సాగింది. ఈ నేపథ్యంలోనే అతడిపై వేటు పడినట్లు తెలుస్తోంది. దీంతో భారత టీ20 జట్టులో సూర్య కుమార్ యాదవ్ ఆధిపత్యానికి తాత్కాలిక విరామం పడినట్లైంది.*

## నార్వే చెస్ టోర్నీలో చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద

### తొలి భారతీయుడిగా రికార్డు..




భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద మరో చారిత్రక ఘనత సాధించాడు. నార్వే 2026 చెస్ టోర్నమెంట్ క్లాసిక్ విభాగంలో టైటిల్ సాధించాడు. ఈ టైటిల్ సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ పోటీలో విజయం సాధించడం ద్వారా ప్రజ్ఞానంద భారత చెస్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు. నార్వేలో జరిగిన టోర్నమెంట్ చివరి రౌండ్‌లో ప్రజ్ఞానంద జర్మనీ క్రీడాకారుడు విన్సెంట్ కీమర్‌పై గెలుపొందాడు. 20 ఏళ్ల ప్రజ్ఞానంద నార్వే చెస్ టోర్నీలో పాల్గొనడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. ఏడుసార్లు నార్వే చెస్ టోర్నీ విజేతగా నిలిచిన ప్రపంచ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఈ టోర్నీలో ప్రజ్ఞానంద మూడు సార్లు ఓడించాడు. టోర్నమెంట్ ప్రారంభ దశలో వెనుకబడినప్పటికీ, రెండో భాగంలో పుంజుకుని వరుసగా అద్భుత ఫలితాలు నమోదు చేస్తూ అగ్ర స్థానానికి చేరుకున్నాడు. పదో రౌండ్ ప్రారంభానికి ముందు 15 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద.. చివరి రౌండ్‌లో విజయం సాధించి మరో మూడు పాయింట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక పదో రౌండ్‌లో ఫ్రాన్స్ ఆటగాడు అలీరెజాతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న అమెరికన్ గ్రాండ్ మాస్టర్ వెస్లీ 17 పాయింట్లకే పరిమితమయ్యాడు. దీంతో 18 పాయింట్లతో టాప్‌లో నిలిచిన ప్రజ్ఞానంద టైటిల్ దక్కించుకున్నాడు. భారత్‌కు చెందిన మరో గ్రాండ్ మాస్టర్ గుకేశ్ చివరి రౌండ్‌లో ఓటమిపాలయ్యాడు. 8 పాయింట్లతో చివరి స్థానానికి పరిమితమయ్యాడు.

## టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు పగ్గాలు




ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో సహా ఆసియా క్రీడలకు భారత టీ20 జట్టును బీసీసీఐ ప్రకటించింది. సూర్యకుమార్ కుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి శ్రేయస్ అయ్యర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ పగ్గాలు అందించింది. అయితే సూర్యకుమార్ యాదవ్ జట్టులోనూ చోటు దక్కించుకోకపోవడం గమనార్హం. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా జట్టులో చోటు దక్కింది. మొదట జూన్ 26, 28 తేదీల్లో భారత్.. ఐర్లాండ్‌తో 2 టీ20లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో 5 టీ20లు, మూడు వన్డేల్లో తలపడనుంది. కాగా సెప్టెంబర్‌లో జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో ప్రాతినిధ్యం వహించనుంది.

**ఆసియా క్రీడలు 2026: భారత జట్టు ఇదే**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబె, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ

**ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు భారత జట్టు**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబె, నితీశ్‌కుమార్‌రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్




# అతడో గేమ్ ఛేంజర్..

### *- టీ20 జట్టుకు వైభవ్ ఎంపికపై బీసీసీఐ*

భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చింది. పదిహేనేళ్ల వయసులోనే తన అత్యద్భుత బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీకి భారత సీనియర్ టీ20 జట్టులో చోటుదక్కింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్య టనలు సహా ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత జట్లలో అతడికి స్థానం కల్పించింది బీసీసీఐ. దీంతో టీమ్‌ఇండియాకు ఎంపికైన అతి పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడీ బుడ్డోడు. ఇక.. వైభవ్ ఎంపికపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రశంసలు కురిపించాడు. 'ఇంత చిన్న వయసులో వైభవ్ ఆడుతు న్న తీరు అసాధారణం. ప్లేఆఫ్ మ్యాచ్‌ల్లోనూ దాదాపు ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ సీజన్‌లోనే కాదు.. గత సీజన్ నుంచే అతడు తన ప్రతిభను చాటుకున్నాడు. తీవ్రమైన పోటీ, ఒత్తిడితో కూడిన టీ20 క్రికెట్లో ఎంతద్భుతంగా బ్యాటింగ్ చేయగలడో చూపించాడు. టీ20 క్రికెట్లో అతడిపై చాలా ఆశలున్నాయి. క్షణాల్లో మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం అతడి సొంతం(గేమ్ ఛేంజర్). ఆ ప్రతిభతోనే జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు' అని కొనియాడాడు అగార్కర్. వైభవ్ ఎంపికతో భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించా యి. భవిష్యత్తులో టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగంలో కీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని క్రికెట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవలి కాలంలో దేశీయ క్రికెట్‌తో పాటు టీ20 టోర్నీల్లో సూర్యవంశీ ప్రదర్శించిన అద్భుత ఆటతీరు సెలెక్టర్లను ఆకట్టుకుంది. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన మ్యాచ్‌ల్లో.. అతడు చూపిన ధైర్యం, దూకుడు, మ్యాచ్‌ను మలుపుతిప్పగల సామర్థ్యం మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. యువ ఆటగాడైనా అనుభవజ్ఞు డిలా ఆడుతూ జట్టుకు విజయాలను అందించడం విశేషం.

చైతన్య రథం సినిమా
ఆదివారం 7 జూన్ 2026 X

## 'జంజీర్' తర్వాత మరో హిందీ మూవీ

# రామ్‌చరణ్ ఏమన్నారంటే...!

హీరో రామ్‌చరణ్ ప్రస్తుతం 'పెద్ది' విజయాన్ని అస్వాదిస్తున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. రెండు రోజుల్లో రూ.191 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలో చరణ్ హిందీ మూవీ చేసే విషయంలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

అపూర్వ లఖియా దర్శకత్వంలో చరణ్ 'జంజీర్ (2013) చేశారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆ తర్వాత 'కిస్ కా బాయ్ కిసి కి జాన్లో'లో అతిథి పాత్రలో తళుక్కున మెరిశారు. ఆ తర్వాత ఎప్పుడూ హిందీ మూవీలో కనిపించలేదు.



అభిమానులు చరణ్ హిందీ మూవీ చేస్తే చూడాలనుకుంటున్నారు. ఆడి అడగ్గా హిందీ, తెలుగు మూవీ అనేవి నాకు తెలియదు. నేను చేసేది ఏదైనా ఇండియన్ మూవీగానే భావిస్తా. నేను ఇలాగే ఆలోచిస్తా బాలీవుడ్, బెంగాలీ, తమిళ్ ఇలా ఏ డైరెక్టర్తోనైనా మూవీ చేయడం నాకు ఇష్టం. అందరితోనూ నాకు పనిచేయాలనుంది" అని చరణ్ అన్నారు. ప్రియాంకచోప్రా కథా నాయికగా నటించిన ఈ మూవీలో శ్రీహరి, ప్రకాశ్‌రాజ్, అతుల్ కుల్‌కర్ణి, మహిగిల్ తదితరులు నటించారు.




## 'మొహబ్బత్' ఫస్ట్ లుక్...

మారుతి డైరెక్షన్‌లో వచ్చిన ప్రేమ కథా చిత్రమ్‌తో పాటు చిక్కిలిగింత, కాయ్ రాజా కాయ్ సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెరిశాడు సంతోష్ కల్వచర్ల. ఈ యంగ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'మొహబ్బత్'. సంతోష్ కల్వచర్ల, శ్రేయాసి సేన్ కాంబోలో యూత్‌ఫుల్ లవ్‌స్టోరీగా వస్తున్న ఈ చిత్రాన్ని మ్యాక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచైన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ యూత్‌లో హైప్ క్రియేట్ చేస్తుంది. బైక్‌పై వెళ్తున్న హీరో, హీరోయిన్లు సూపర్ రొమాంటిక్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఈ మూవీలో అజయ్ ఘోష్, సాత్విక్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏబీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నాడు. నిర్మాత అఫ్రోజ్ తొలి సినిమానే అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేసేలా సినిమాను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. అన్ని రకాల ఎలిమెంట్స్‌తో సాగే ఎమోషనల్ యూత్‌ఫుల్ జెన్‌జీ చిత్రంగా 'మొహబ్బత్' ఉండబోతోందని మేకర్స్ చెబుతున్నారు.

## 'మేన్ వాపస్ ఆవుంగా' ప్రమోషన్స్

### వాఘా బోర్డర్‌లో జవాన్ల కోసం ఏఆర్ రెహమాన్ ప్రత్యేక ప్రదర్శన



ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ జూన్ 7వ తేదీన అట్టారీ సరిహద్దులో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వీరులకు సంగీత రూపంలో ఘన నివాళి అర్పించనున్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెడుతున్న బీఎస్ఎఫ్ జవాన్ల ధైర్యసాహసాలు, త్యాగాలు మరియు నిబద్ధతకు కృతజ్ఞతగా 'మేన్ వాపస్ ఆవుంగా' చిత్ర బృందంతో కలిసి ఆయన ఈ ప్రత్యేక ప్రదర్శనను ఇవ్వనున్నారు. 'జై హో-ఎ ట్రిబ్యూట్ టు ది బ్రేవ్‌హార్ట్స్' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ గ్రహీత ఏఆర్ రెహమాన్‌తో పాటు దర్శకుడు ఇంతియాజ్ అలీ, యువ నటుడు వేదాంగ్ రైనా, చిత్ర గాయకులు మోహిత్ చౌహాన్, పూజా తివారీ, నర్గిస్ కూడా పాల్గొననున్నారు. అట్టారీ బోర్డర్‌లోని జేసీపీ స్టేడియంలో ప్రతిరోజూ జరిగే ఐకానిక్ పరేడ్ వేడుకల సమయంలో సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల మధ్య ఈ అద్భుతమైన ప్రదర్శన జరగనుంది. దేశభక్తి, సంగీతం, భావోద్వేగాల కలయికగా సాగనున్న ఈ వేడుక సరిహద్దులో ఒక మరపురాని అనుభూతిని మిగల్చనుంది.

ఇక ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన 'మేన్ వాపస్ ఆవుంగా' చిత్రం 1947 నాటి భారత దేశ విభజన నేపథ్యంలో సాగే ఒక పీరియడ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతోంది. షర్వారీ, నసీరుద్దీన్ షా, వేదాంగ్ రైనా, దిల్జిత్ దోసాంజ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, విండో సీట్ ఫిల్మ్స్, మోహిత్ చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదల కానుంది.



## పట్టుచీరలో... అందాల కనువిందు

స్టార్ యాంకర్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అనసూయ భరద్వాజ్ తర్వాత సినిమాల్లో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. యాంకరింగ్‌కు గుడ్‌బై చెప్పిన ఆమె సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది. తాజాగా అనసూయ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరలవుతున్నాయి. ఈ ఫొటోల్లో అనసూయ పట్టుచీర కట్టుకుని ఎంతో సంప్రదాయంగా కనిపించింది. చీరకు తగ్గట్టుగా టెంపుల్ జ్యువెలరీ ఇయర్ రింగ్స్ పెట్టుకుని తన లుక్ మరింత ఎలివేట్ అయ్యేలా చేయగా... ఆ ఫొటోలకు కామెంట్స్ చేస్తూ నెటిజన్లు వాటిని వైరల్ చేస్తున్నారు.



## క్షమాపణ కోరుతున్నా..

### 'పెద్ది'.. ముద్దు సీన్‌పై స్పందించిన బుచ్చిబాబు

మహిళలంటే తనకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉందని దర్శకుడు బుచ్చిబాబు తెలిపారు. రామ్‌చరణ్ హీరోగా ఆయన తెరకెక్కించిన 'పెద్ది' సినిమాలో హీరోయిన్ పాత్రను చూపించిన విధానంతో పాటు కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సెలబ్రిటీలు సైతం. వీటిని తప్పుపడుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు వివరణ ఇచ్చారు. క్షమాపణలు కోరుతూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

"ఒక దర్శకుడిగా.. సినిమాతో ప్రేక్షకులను అలరించాలి, వారిలో స్ఫూర్తి నింపాలని, వారితో మమేకం కావాలని నేను అనుకుంటాను. ఎవరినీ అసౌకర్యానికి గురిచేయాలని, అగౌరవపరచాలని చూడను. పెద్ది'లోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు మా దృష్టికి వచ్చాయి. వాటిని తీవ్రంగా పరిగణించాం. తెరపైన, తెర వెనుక కూడా మహిళలంటే నాకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉంది. మహిళల పాత్రలను అగౌరవపరచడం నా ఉద్దేశం కాదు. ఈ సినిమాలో సన్నివేశాలు మీ మనోభావాలు దెబ్బతీసేలా ఉంటే మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను" అని బుచ్చిబాబు తన పోస్ట్ రాశారు.

ఇక విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయా సన్నివేశాల్లో మార్పులు చేస్తామని బుచ్చిబాబు తెలిపారు. "అన్ని పోస్ట్‌లను గమనించిన తర్వాత సంబంధిత సన్నివేశాల్లో మార్పులు చేయాలని మేము నిర్ణయించుకున్నాం. ప్రేక్షకులు ఆదరిస్తేనే సినిమా ఎదుగుతుంది. అభిమానులతో ఉన్న అనుబంధమే సినిమా రంగాన్ని ముందుకు తీసుకెళ్తుంది. అలాంటి అభిమానుల భావోద్వేగాలు, అంచనాలను దృష్టిలో పెట్టుకుని కథలు రాసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. కొన్ని సున్నితమైన అంశాలపై కచ్చితంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రతి మహిళా గౌరవానికి అర్హురాలే వారిని శక్తిమంతంగా చూపించడానికి, వారి విలువను పెంచే కథలు చెప్పడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని బుచ్చిబాబు చెప్పారు. 'పెద్ది' విషయంలో అభిప్రాయాలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.